JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 309 28 ఆదివారం జూన్ 2026 ఎడిటర్ గుంటపల్లిస్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

## కరీంనగర్ మానేరు డ్యాం లో ఆటలు ఆడిన ఎమ్మెల్యే గంగుల

జనసైన్యం సిటి

ఎల్ ఎం డి జలాశయం అడుగంటడంతో.. కరీంనగర్ నగర ప్రజలకు, హుజురాబాద్ మానకొండూరు నియోజకవర్గం రైతులకు సాగునీరుకు ఇబ్బందులు మొదలైన దృష్ట్యా.. శనివారం రోజున నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో... బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు... ఎల్ఎండిలో వినూత్న కార్యక్రమంతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ హాజరై.. పార్టీ శ్రేణులతో కలిసి... అడుగంటిన జలాశయంలో.. ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా ఆటలను ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. కరీంనగర్ రెండు దశాబ్దాల చరిత్రలో జూలై మాసంలో ఎల్. ఎం. డి నీటి నిల్వలు డేడ్ స్టోరేజ్ కి పడిపోవడం ఇదే మొదటిసారి అని. కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ప్రజలకు త్రాగునీరు సాగునీరు అందకుండా పోతుందన్నారు. మేడిగడ్డను మరమ్మత్తు చేయకపోవడం ద్వారా... ప్రతిరోజు 10 నుంచి 15 వేల క్యూసెక్కుల నీరు రాజమండ్రి ద్వారా సముద్రంలో కలుస్తుందని.. ఆ నీటిని నిల్వ చేసి.. మేడిగడ్డ నుండి కన్నెపల్లి,సుందిళ్ల, అన్నారం, ఎల్లంపల్లి లకు తరలించి.. ఎల్లంపల్లిలో మోటార్లను ఆన్ చేసి.. వరద కాల ద్వారా మిడ్ మానేరు, ఎల్ఎండి లను నీటితో నింపాలన్నారు. అదేవిధంగా మిడ్ మానేరు పై...



ఆచంపల్లి దగ్గర ఉన్న తూము ద్వారా... నీటిని విడుదల చేయడం ద్వారా.. కొత్తపెల్లి మండలంలోని బావు పేట, ఎలగందుల, నాగుల మల్యాల, బద్దిపల్లి, కమాన్పూర్, శ్రీరాములపల్లి , కాజీపూర్ గ్రామ చెరువులు నింపాలన్నారు... ప్రభుత్వం చేతకాదని చేతులెత్తేస్తే. కెసిఆర్ నాయకత్వంలో కేటీఆర్ హరీష్ రావు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి.. కన్నెపల్లి లో ఉన్న మోటార్లను ఆన్ చేసి.. ప్రజలకు నీరందిస్తామన్నారు. బేషాజాలకు పోకుండా.. ప్రజలకు నీరందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎల్ఎండిలో ఐదున్నర టీఎంసీలు మాత్రమే నిల్వ ఉందని... ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా.. వర్షాలు పడే అవకాశం లేదన్నారు. మూడు టీఎంసీలు డెడ్ స్టోరేజ్ గా ఉంటుందని కేవలం రెండు టీఎంసీల నీటి ద్వారా కరీంనగర్ ప్రజలకు త్రాగునీరు అందించలేమన్నారు. టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో.. ప్రతిరోజు త్రాగునీరు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో.. ప్రస్తుతం రెండు మూడు రోజులకు ఒకసారి మంచినీళ్లు అందిస్తున్నారని పేర్కొన్నారు.పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇటు త్రాగునీరుకు కరీంనగర్ ప్రజలకు ఇబ్బంది తలెత్తుతుందని.. ఎల్ఎండి మీద ఆధారపడి వ్యవసాయం సాగు చేసుకుంటున్నా మానకొండూరు హుజురాబాద్ నియోజకవర్గ రైతులకు సాగునీరు లేక రైతులు రోడ్డున పడే పరిస్థితి ఉత్పన్నమవుతుందన్నారు.మా ప్రభుత్వ హయాంలో.. కాలేశ్వరం ప్రాజెక్టు నీటిని ఎత్తిపోసి.. ఏప్రిల్ మే మాసాలలోనే.. ప్రాజెక్టులన్నింటినీ నింపి తద్వారా చెరువులకు నీరును తరలించి మత్తుడులు దుంకించిన విషయాన్ని గుర్తు చేశారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో.. ఎల్ఎండిలో.. ఎప్పుడు 10:30 టీఎంసీలు నిలువ ఉండేవిధంగా ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. కన్నెపల్లిలోని మోటార్లను ఆన్ చేసి.. మిడ్ మానేరు ఎల్ ఎం డి లను నింపాలన్నారు. ప్రజలకు నీటిని అందించే వరకు పోరాడాతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో.. ఎమ్మెల్యే గంగులతో పాటు. బారాస కార్పొరేటర్లు, ఆయా గ్రామాల సర్పంచులు,మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు.. పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గంగులా దమ్ముంటే సవాల్ స్వీకరించు

జనసైన్యం సిటి

మానేరు డ్యాంలో నీళ్లు లేవని తాగునీటికి కూడా సరిపోవని కేసీఆర్ హాయంలో ఎన్నడూ డ్యాం నీటిమట్టం టిఎంసిల కంటే తగ్గలేదని ప్రజలను తప్పుదోవపట్టిస్తూ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డ్యాంలో ఆటలు ఆడి డ్రామాలాడారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఉదయం గంగుల డ్యాంకు వెళ్లి ఆటలాడుతే సాయంత్రం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అధికారులు నాయకులు కార్యకర్తలతో వెళ్లి నీటిని పరిశీలించి మీ హాయంలో ఇదే సీజన్ లో 15 టిఎంసిల కంటే ఎన్నడూ తగ్గలేదన్నావ్ గదా ఇదిగో అధికారిక ఆధారాలు చూపిస్తున్న దమ్ముంటే నాసవాలును స్వీకరించు నిరూపిస్తే నేను ముక్కు నేలకు రాస్తా నిరూపించకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్ అని నరేందర్ రెడ్డి సవాల్ విసిరారు. ఇప్పుడున్న 5.8 టిఎంసిలలో డెడ్ స్టోరేజ్ పోను 2 టిఎంసిలు నీళ్లు రాబోయే నెలల వరకు కరీంనగర్ నగర ప్రజల త్రాగు నీటికి మిషన్ భగీరథకు సరిపోతుందని ఈ లోగా వర్షాలు కురుస్తాయని ఒకవేళ ఇంకా ఇబ్బందయితే మిడ్ మానేరులో 4 టిఎంసిలు అదనంగా ఉన్నాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. కమీషన్ల కక్కుర్తితో కాళేశ్వరాన్ని కూలేశ్వరం చేసింది చాలక కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేస్తే నీళ్లు వచ్చేవని మాట్లాడుతున్నారని అదేమన్నా ప్యాచ్ వేస్తే ఆగేదా అని ఎద్దేవా చేశారు. ఇటువంటి డ్రామాలు,అబద్ధాలు ఆపకపోతే మీరు డ్యాంలో ఫుట్ బాల్ ఆడిండ్రు గదా ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానకపోతే ప్రజాక్షేత్రంలో ప్రజలే మిమ్ములను ఫుట్ బాల్ ఆడుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కార్పోరేటర్ పర్వతాల మల్లేశం,గోపు



సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

మల్లారెడ్డి,లయాక్,చర్ల పద్మ,నెల్లి నరేష్,షబానా మహమ్మద్,ముల్కల కవిత,జ్యోతి రెడ్డి,అస్థాపురం తిరుమల,మహాలక్ష్మి,కంది అశోక్ రెడ్డి,బషీర్, షెహన్షా,మాసుం ఖాన్,రాజ్ కుమార్, హనీఫ్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## సత్తినేని శ్రీనివాస్‌కి జన్మదిన శుభాకాంక్షలు



## రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు



## రాజలింగంకు జన్మదిన శుభాకాంక్షలు

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**జనసైన్యం సిటి**
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు.కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమం పేరుతో కోట్లాది మంది పేదలు, వలస కార్మికులు, గిరిజనులు, దళితులు, మైనారిటీలు మరియు అట్టడుగు వర్గాల ఓటు హక్కులు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందన్నారు.ఎన్నికల జాబితాల్లో పేర్ల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలు పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం అమలు చేస్తున్న సర్ విధానం అనేక సందేహాలకు తావిస్తోందని అన్నారు.దేశంలోని పలు రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య శక్తులు ఈ ప్రక్రియలో అక్రమాలు జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలనిసూచించారు.ప్రతి ఓటరికి తగిన సమాచారం అందించి, అభ్యంతరాలు తెలిపేందుకు తగినసమయంఇవ్వాలన్నారు. ప్రజల ఓటు హక్కును హరించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్ట రాదన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత ప్రాథమిక రాజ్యాంగ హక్కు అని గుర్తు చేశారు. అందువల్ల ఎన్నికల సంఘం రాజకీయ పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, ప్రజల్లో అనుమానాలకు తావులేకుండా సర్ ప్రక్రియను నిర్వహించాలని కోరారు.ఎన్నికల జాబితాల సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరిగితే సిపిఎం తీవ్రంగా ప్రతిఘటిస్తుందని అన్నారు..చదువురాని, నిరక్షరాస్య ఓటర్లకు ఫారాలు నింపడంలో బీఎల్‌వోలు ప్రత్యక్షంగా సహాయం చేయాలని, సాంకేతిక కారణాలతో ఏ ఒక్క అర్హుడి ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
అలాగే, ఆధార్ కార్డు ఓటరు గుర్తింపునకు తప్పనిసరి లేదా ఏకైక ప్రామాణిక పత్రం కాదని, చట్టబద్ధంగా అనుమతించిన ఇతర గుర్తింపు పత్రాలను కూడా అధికారులు స్వీకరించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత పాటించి ప్రతి అర్హుడి ఓటు హక్కును పరిరక్షించాలని అధికారులను కోరారు.ప్రజలకు ఇబ్బందులు



కలిగించే నిబంధనలను ఉపసంహరించుకోవాలని వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రజల పక్షాన నిలబడి పోరాడే కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేద్దాం.



**జనసైన్యం సిటి**
సమాజంలో నిరంతరం ప్రజల కోసం,వారి సంక్షేమం కోసం నిలబడే కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని,సమస్యల వారిగా పోరాటాలు నిర్వహించడానికి అందరూ సంఘటితం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.
శనివారం గుంటూరుపల్లి లో సిపిఐ గ్రామ శాఖ ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను పంజాల శ్రీనివాస్ ఎగురవేశారని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం,వర్గ రహిత సమాజం కోసం,కార్మిక వర్గ ప్రయోజనాలే ముఖ్యమని సిపిఐ వందేళ్లుగా ప్రజల పక్షాన పోరాడుతుందని,అనేక పార్టీలు పుట్టుకొచ్చాయి,కాలగర్భంలో కలిసి పోయాయని కానీ నేటికి సజీవంగా ఉన్న పార్టీ సిపిఐ అని,సమస్య ఎక్కడ ఉంటే అక్కడ కమ్యూనిస్టులు ఉంటారని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు గడిచినా,పాలక ప్రభుత్వాలు మారినా ప్రజల బ్రతుకులు మారడం లేదని,కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేక పోతున్నారని,నిరుద్యోగం పెరిగిపోతుందని,అవినీతి,అక్రమాలు రోజు రోజుకు పెరుగుతుందని,పేదలు మరింత పేదలుగా,ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారని,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందడం లేదని,పెట్టుబడి దారుల చేతుల్లో దేశ సంపద చిక్కుకుంటుందని అందుకు పాలక ప్రభుత్వాలే ప్రధాన కారణమని శ్రీనివాస్ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు పెరిగిపోయాయని,ప్రజలపై పన్నుల భారం విపరీతంగా పడుతుందని,కార్పోరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ,ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల బ్రతుకులు మారుతాయని అనుకుంటే గత పాలకులాగా ఈ పాలకులు కూడా వ్యవహరిస్తున్నారని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో జాప్యం జరుగుతుందని,పేదల సంక్షేమం కోసం పనిచేయక పోతే రానున్న రోజుల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఐ పోరాటాలు ఉధృతం చేయకతప్పదని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నలువాల సదానందం, సిపిఐ గుంటూరు పల్లి శాఖ కార్యదర్శి సాయవేణి రాయమల్లు,సీనియర్ నాయకులు సామల్లా కొమురయ్య, చిందశీ మల్లయ్య,నాయకులు తంగెళ్ళ లక్ష్మయ్య,పిల్లి రమేష్,తాత సమ్మయ్య,తంగెళ్ళ సంపత్,సదయ్య,గొడుగు సంపత్,సాయవేణి రాజు తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం వెయ్యి కోట్లు కేటాయించాలి

**జనసైన్యం సిటి**



శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం శాతవాహన యూనివర్సిటీ, ఆర్ట్స్ కళాశాలలో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన రెహమాన్, ప్రభుత్వ యూనివర్సిటీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో, విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని రెహమాన్ డిమాండ్ చేశారు.
శాతవాహన యూనివర్సిటీ ఎజ ప్రశ్నించే విద్యార్థులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ప్రొఫెసర్ గా విద్యార్థులను చైతన్యం చేయాల్సిన ఎజ, విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎజ విద్యార్థుల పట్ల తన వైఖరి మార్చుకోవాలని, లేదంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని రెహమాన్ హెచ్చరించారు. AISF జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణకు గర్వకారణంగా వున్న, శాతవాహన యూనివర్సిటీ పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ విద్యార్థులకు 24 గంటలు లైబ్రరీ సౌకర్యం కల్పించాలని, మౌలిక సదుపాయాలు పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో AISF నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సందీప్, శాతవాహన యూనివర్సిటీలోని వివిధ డిపార్ట్మెంట్ ల విద్యార్థులు శివాజీ, లక్ష్మణ్, ప్రవీణ్, శివ, అశోక్, క్రిష్ణ, సాయికిరణ్, రోహిత్, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రన్నింగ్ కాలమ్



వెనిజులాను వణికించిన
భయంకరమైన ప్రళయం
వేలాది మందిని మింగేసిన
ఊహకందని విలయం

కళ్ళ ముందే కూలిపోయిన
కలల లోగిళ్ళ భవనాలు
భూకంపాల ప్రకోపానికి
రెచ్చిన మానవ హననాలు

-పెనుగొండ
బసవేశ్వర్..

## నూతన రైతు భరోసా దరఖాస్తులు స్వీకరణ




కోహెడ మండల్ తంగళ్ళపల్లి గ్రామంలో రైతువేదిక లో వానకాలం 2026 సీజన్‌కు నూతన రైతు భరోసా దరఖాస్తులు వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్ స్వీకరించడం జరిగింది.ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం కింద కొత్తగా అర్హత పొందిన రైతుల నుండి దరఖాస్తులు కోరడమైనది.15 జూన్ 2026 నాటికి కొత్తగా పట్టా పాస్ బుక్ పొందిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలి.గతంలో రైతు భరోసా పొందుతున్న వారు మళ్ళీ దరఖాస్తు చేయనవసరం లేదు. అప్లికేషన్ ఫామ్ తోపట్టాదారు పాస్ పుస్తకం,ఆధార్ కార్డు మరియు బ్యాంక్ పాస్ పుస్తకం 05-07-2026 లోపు తప్పనిసరిగా అందజేయాలి. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులు పరిశీలించబడవు.కావున గడువు తేదీ లోపు అర్హత కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

## ఆలయన్స్ గ్రీన్ అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ




ఎల్ నీనో ప్రభావంతో వాతావరణం లో వస్తున్న విపరీత మార్పులను అధ్యయనం చేసి పర్యావరణమును కాపాడడానికి భవిష్యత్ లో తగు జాగ్రత్తలను తీసుకోవడానికి నేటి తరం విద్యార్థులను ఇప్పటినుండే సన్నద్ధం చేసే బృహత్తర ప్రణాళికను రూపొందించిండానికి స్వదేశీ సేవా దిగ్గజం ఆలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంస్థ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు.జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్ సూచనల మేరకు వాసుదేవ హాస్పిటల్స్ వైద్యులు డా. ఎలగందుల శ్రీనివాస్ ప్రచురణ చేసిన ఆలయన్స్ గ్రీన్ అవార్డ్స్ పోస్టర్ ను ఆలయన్స్ స్మార్ట్ సిటీ క్లబ్ వ్యవస్థాపకులు, ప్రముఖ సైకాలజిస్ట్ నాగేశ్వర్ గాలిపల్లి, అచీవర్స్ స్కూల్ కరెస్పాండంట్, ఆలయన్స్ అంతర్జాతీయ కమిటీ చైర్మన్ చెర్మల వెంకటేశ్వర్లుతో కలిసి ఈరోజు ఆవిష్కరించారు. చెట్లను నరికి వేయడం, తగు నిష్పత్తి లో తిరిగి పెంచక పోవడం, కాలుష్యాన్ని, ప్లాస్టిక్ ను నియంత్రించక పోవడం పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగి పోవడం అతివృష్టి అనావృష్టి పరిస్థితులకు కారణం అవుతున్నాయని నాగేశ్వర్ గాలిపల్లి అన్నారు..దీనిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు లో ఉష్ణగ్రతలు ఇంకా పెరిగి వర్షాభావ ప్రమాదం ఉందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సమగ్ర సవరణ(SIR) ప్రక్రియను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



జనసైన్యం సిటి
చొప్పదండి మండలం రుక్మాపూర్, కొలిమికుంట గ్రామాలలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ(SIR) ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ ( స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే క్షేత్రస్థాయిలో పరిశీలించారు.బి.ఎల్.వోలు ఇంటింటికి వెళ్లి ఎస్.ఐ.ఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని, ఉన్నతాధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు.

# ఊహించని నష్టాల నివారణకు భద్రత గొడుగు భీమా

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి

(28 జూన్ "జాతీయ భీమా అవగాహన దినం" సందర్భంగా)




ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియదు. వ్యాధులు వెంటాడవచ్చు, ప్రమాదాలు జరగవచ్చు, ప్రాణాలు సహితం పోవచ్చు. నేడు ఆకస్మికంగా జరిగిన అనర్థానికి మనతో పాటు మన కుటుంబ సభ్యులు బజారున పడే అవకాశాలు ఉండవచ్చు. అనారోగ్యాలు, మరణాలు, ప్రమాద నష్టాలు, విపత్తులు జరిగినపుడు మనకు, మన కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత ఇవ్వడానికి జీవిత భీమా కంపెనీలు వెసులుబాటు కల్పించడం జరుగుతున్నది. మన ఇంటిని, ప్రధాన వస్తువులను కూడా భీమా చేయించుకునే సదుపాయాలు ఉన్నాయి. రేపటి సురక్ష కోసం నేడు మనం తీసుకునే మంచి నిర్ణయమే జీవిత భీమా. మన ఆదాయం, ఆరోగ్యం, ఆస్తి, ఆర్థికం లాంటి వాటికి నష్టం జరిగినపుడు భీమా మాత్రమే మనకు తక్షణ రక్షణ గొడుగుగా నిలుస్తుంది. అనర్థాలు చెప్పి రావు కాబట్టి అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలు, అకాల మరణాలు, అనారోగ్యాలు, ప్రకృతి విపత్తులు, ఆస్తి నష్టాలు జరిగినపుడు మనకు భద్రతను ఇవ్వడానికి జీవిత భీమా పాలసీలు ఉపయోగపడతాయి.

**జాతీయ భీమా అవగాహన దినం-2026:**

మనకు, మనం అమితంగా ప్రేమించే కుటుంబ సభ్యులకు కొండంత ఆర్థిక అండగా నిలిచే భీమా పాలసీల ప్రాధాన్యాన్ని వివరించడానికి ప్రపంచ దేశాలు ప్రతి ఏట 28 జూన్‌న "జాతీయ భీమా అవగాహన దినం (నేషనల్ ఇన్సురెన్స్ అవేర్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. అనుకోని విధ్వంసం జరిగినపుడు ఆదుకునే ఆపన్నహస్తమే భీమా పాలసీ. ప్రతి ఒక్కరు తమకు అనువైన భీమా పాలసీలను తీసుకొని తమ భవిష్యత్తుకు భద్రత కల్పించుకోవాలి. జీవితాలు, వాహనాలు, గృహాలు, ఆరోగ్యాలు, వరదలు, ఆస్తులు, ప్రధాన వస్తువులను భీమా చేయించుకునే వెసులుబాటు కల్పించబడింది.

**భారత్‌లో జీవిత/జనరల్ భీమా కంపెనీలు:**

భారతదేశవ్యాప్తంగా 24 జీవిత భీమా కంపెనీలు ఉండగా, అందులో "లైఫ్ ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి)" మాత్రమే ఏకైక ప్రభుత్వరంగ సంస్థగా పేరుగాంచగా, మిగిలిన 23 కంపెనీలకు పైగా ప్రైవేట్ యాజమాన్యాలతో నడుస్తున్నాయి. తాజా వివరాల ప్రకారం జీవిత భీమాతో పాటు జనరల్ భీమా కంపెనీలు కలుపుకొని మొత్తం 57 వరకు ఉన్నాయి. వీటిలో 24 జీవిత భీమా కంపెనీలు, 33 జనరల్ భీమా కంపెనీలు ఉన్నాయి. భారత్‌లో ఎల్ఐసి కంపెనీ అగ్రగామిగా అత్యధిక పాలసీలను కలిగి ఉండగా, తర్వాత స్థానాల్లో బజాజ్, ఎస్‌బిఐ లైఫ్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఐసిఐసిఐ లోంబార్డ్ లైఫ్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్, జనరల్ ఇన్సురెన్స్ లాంటి కంపెనీలు మార్కెట్‌లో ముందు వరుసలో ఉన్నాయి. భీమా రంగంలో ఎల్ఐసి మార్కెట్ షేర్ తొలి ఏడాది ప్రీమియమ్ ఆదాయం ఆధారంగా 57 శాతం దక్కించుకొని ఇతర కంపెనీలకు అందనంత దూరంలో నిలుస్తూ తన సత్తాను చాటుకుంటున్నది.

నష్టం జరిగిన తర్వాత దుఃఖించడం కన్న సకాలంలో మనకు నచ్చిన భీమా పాలసీలను తీసుకోవడం ఉత్తమ పౌరుల లక్షణమని తెలుసుకోవాలి. ఆకస్మిక విపత్తులు, ప్రమాదాలు, ప్రాణాపాయాలకు తక్షణ రక్షణ గొడుగులుగా భీమా పాలసీలు ఆర్థిక భద్రతను కల్పిస్తాయి. నేడే మనం జీవిత భీమా చేసుకుందాం.

# కరీంనగర్ పట్టణాన్ని ప్లాస్టిక్ నుండి కాపాడాలి




ప్రజలు విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీలలో పడి వేయడం వలన కరీంనగర్ పట్టణంలోని పెద్ద డ్రైనేజీలు అన్ని కూడా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి ఉన్నాయన్నారు. దీనివలన వర్షం నీరు రోడ్లపై ప్రవహించి వరదగా మారుతుందన్నారు. కనుక కరీంనగర్ పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చి నగరాన్ని కాపాడాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. శనివారం ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
ప్రజల లోపల ఈ మార్పు రావాలంటే అన్ని మతాల పెద్దలు, అన్ని రాజకీయ పార్టీలు, వివిధ పౌర సంఘాల నాయకులు,కార్పొరేటర్లు నగరపాలక అధికారులు,పోలీస్ అధికారులు, విద్యార్థులు, యువకులు, కార్మిక సంఘాల నాయకులు,న్యాయవాదులు, టీచర్లు,డాక్టర్లు, జర్నలిస్టులు అందరూ బాధ్యత వహించి ప్రజలలో ఒక మార్పు తీసుకురావడానికి కృషి చేయాలి అప్పుడే ఇది సాధ్యం అవుతుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తీయడానికి నగరపాలక సంస్థ లక్షల రూపాయలను వెచ్చించాల్సి వస్తుందన్నారు.
డ్రైనేజీ ల మీద కప్పులు వేసి మూసి వేయడం మూలంగా సమస్య ఇంకా జటిలం అయిపోయింది. కరీంనగర్ పట్టణాన్ని అందరం కలిసి కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుకుగా ఉన్న సందుల్లో వీలున్న రోడ్లను వెడల్పు చేయాలన్నారు. కరీంనగర్ పట్టణంలో గ్రీనరీ తక్కువగా ఉన్నది కనుక ఒక లక్ష మొక్కలు నాటి వాటిని నగరపాలక సంస్థ, ప్రజలు కలిసి కాపాడాలన్నారు. కొత్తగా ఎన్నికైన మేయర్, కార్పొరేటర్లు అందరూ ఈ దిశలో ఆలోచించి పని చేయాలన్నారు. ఈ మీడియా సమావేశంలో చిగిరి శ్రీధర్, కొంపల్లి రవీందర్, ఎడ్ల రామకుమార్, చిలువేరి రవీందర్,కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# బంధాలు - నమ్మకాలు



మనిషిని బలవంతుడిని చేసేది..
నోట్ల కట్టలు అనే వాళ్లే అధికం తెలుసా..
డబ్బుకు లోకం దాసోహం నిజమేనేమో !
మనిషి అసలైన బలం ఏమిటో తెలుసా !
మన అత్యంత ఆత్మీయ పరివారమే కదా
అమ్మ చల్లని ఒడి, నాన్న అద్వితీయ భరోసా...
తోబుట్టువుల చేయూతే కొండంత బలం !
అమ్మ నాన్నల బంధం పరమ పవిత్రం
తోబుట్టువుల ప్రేమ అనిర్వచనీయం
ఏ ధనం కొనలేని పటిష్ట బంధాలే !
బంధాల్లో చిన్న, పెద్ద అని ఏమీ ఉండవు..
అమ్మ బంధం ముందు అన్నీ దిగదుడుపే
అమ్మ చేయి థర్మామీటర్ కన్న ఖచ్చితం !
అమ్మకు ఏది ఇష్టమో తెలుసా..
బిడ్డలకు ఇష్టమైందే అమ్మకు కూడా ఇష్టం
అమ్మకంటూ ఏ ఇష్టం ఉండదేమో కదా !
బిడ్డ నవ్వితే అమ్మ నవ్వుతుంది
బిడ్డ ఏడిస్తే అమ్మ కళ్లు చెరువులవుతాయి
బిడ్డ తింటే అమ్మ కడుపు నిండుతుంది !
కలియుగం వాస్తవం ఏమిటో తెలుసా..
ముందు జేజేలు పలికే జనులే...
వెనకాల చేరి విషం చిమ్ముతున్నారు !
మనసును పిండేసే సంగతి ఏమిటో తెలుసా..
మనం కలిసిన కొందరిని అసలే మరువలేం
వారేమో మనల్ని ఎన్నడూ గుర్తు ఉంచుకోలేదు !
సంబంధాలు అందరితో పెట్టుకోవచ్చు..
నమ్మకం మాత్రం ఎవరితో పెట్టుకోవద్దు..
నరులెపుడూ నట్టేట ముంచే ప్రబుద్ధులే !

మధుపాళీ

# సంచలనం సృష్టించిన కరీంనగర్ కుర్రాడు



తెలంగాణ టీ20 (T G20) లీగ్‌లో వరంగల్ వారియర్స్ కెప్టెన్ అమన్ రావు పెరాలా కేవలం 32 బంతుల్లో సెంచరీ బాది దేశీయ టీ20 క్రికెట్‌లో కొత్త చరిత్ర సృష్టించాడు. 48 బంతుల్లో 142 పరుగులతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి అందరి దృష్టిని ఆకర్షించాడు.

**అమెరికాలో జననం.. హైదరాబాద్‌లో ఎదుగుదల**

అమన్ రావు పెరాలా 2004 జూన్ 2న అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రం మాడిసన్‌లో జన్మించాడు. ఆరు నెలల వయసులోనే కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వచ్చాడు. హైదరాబాద్‌లోని సెయింట్ జాన్స్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొంది తన క్రికెట్ ప్రయాణాన్ని ప్రారంభించాడు.

**అమన్‌రావు తండ్రి ఎవరో తెలుసా?**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్నంపల్లికి చెందిన పేరాల మధుసూదన్?రావు సైతం క్రికెట్ ఆటగాడుగా కరీంనగర్ లో హిందూ క్రికెట్ క్లబ్ కు ప్రాతినిధ్యం వహించే వారు. ఆ తరువాత ఐటీ ప్రొఫెనల్‌గా ఉద్యోగరీత్యా కుటుంబంతో కలిసి అమెరికాకు వెళ్లారు. ఆ తరువాత అమెరికా నుంచి తిరిగి వచ్చారు. ఆ సమయంలో అమన్ వయస్సు మూడేళ్లు.. చిన్నతనంలో అన్నతో కలిసి క్రికెట్ అకాడమీకి వెళ్లడం వల్లే అమన్‌కు క్రికెట్‌పై ఆసక్తి పెరిగింది. 7 ఏళ్ల వయస్సు నుంచి శిక్షణ తీసుకున్నారు. కరీంనగర్ హిందూ క్రికెట్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించే అమన్‌రావు నిరంతర కృషి, పట్టుదలతో కోచ్ శరత్ ముదిరాజ్ వద్ద క్రికెట్ మెలకువలను నేర్చుకున్నాడు.

**అమెరికా పౌరసత్వానికి గుడ్‌బై**

అమెరికాలో జన్మించిన కారణంగా అమన్‌కు అమెరికా పౌరసత్వం ఉండేది. భారత దేశీయ క్రికెట్‌లో ఆడాలంటే భారత పౌరసత్వం తప్పనిసరి కావడంతో అమెరికా పాస్‌పోర్ట్‌ను వదులుకుని భారత పౌరసత్వాన్ని స్వీకరించాడు. దాదాపు ఏడాది పాటు పత్రాల ప్రక్రియ పూర్తయ్యాక హైదరాబాద్ తరపున మళ్లీ ఆడే అవకాశం దక్కింది.

**దూకుడుగా ఆడడమే ఆయన స్టైల్**

హైదరాబాద్ తరపున ఆడుతున్న అమన్ రావు 2025-26 విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్‌పై 154 బంతుల్లో అజేయంగా 200 పరుగులు చేసి హైదరాబాద్ తరపున లిస్ట్-ఏ క్రికెట్‌లో డబుల్ సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. అదే సీజన్‌లో సయ్యద్ ముష్తాక్ అలీ ట్రోఫీలో 160కు పైగా స్ట్రైక్‌రేట్‌తో ఆకట్టుకున్నాడు.

**ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ ఎంపిక**

అమన్ రావు ప్రతిభను గుర్తించిన రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ అతడిని ఐపీఎల్-2026 కోసం రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో మ్యాచ్ ఆడే అవకాశం రాకపోయినా, ఇప్పుడు టీజీ20లో ఆడిన విధ్వంసక ఇన్నింగ్స్‌తో వచ్చే సీజన్‌లో అవకాశాలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

**వరంగల్ వారియర్స్‌కు కీలక ఆటగాడు**

తెలంగాణ టీ20 లీగ్‌లో వరంగల్ వారియర్స్ జట్టు అమన్ రావును కీలక బ్యాటర్‌గా ఎంపిక చేసింది. భారత పేసర్ మహ్మద్ సిరాజ్‌తో కలిసి జట్టుకు ప్రధాన బలంగా నిలుస్తున్నాడు. కెప్టెన్‌గా జట్టును నడిపిస్తూ బ్యాట్‌తోనూ సంచలన ప్రదర్శనలు చేస్తున్నాడు.

**భవిష్యత్తుపై భారీ అంచనాలు**

దేశీయ క్రికెట్‌లో డబుల్ సెంచరీ, ఇప్పుడు 32 బంతుల్లో సెంచరీ, వరుస రికార్డులతో అమన్ రావు భారత క్రికెట్‌లో అత్యంత ఆశాజనక యువ బ్యాటర్లలో ఒకరిగా ఎదుగుతున్నాడు. ఇదే ఫామ్ కొనసాగితే త్వరలోనే ఐపీఎల్‌లోనూ, భారత జట్టులోనూ అతడికి అవకాశం దక్కే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి.



# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త




బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును బుకింగ్ చేసుకోవాల్సిన

ఫోన్ నెంబర్

9246966660

## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు


ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం



బాపురెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



పుప్పాల యాష్ వర్ధన్ కు జన్మదిన శుభాకాంక్షలు



జక్కుల రవి అవంతి దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు

# బీజేపీ, ఆరెస్సెస్ - రాజ్యాంగ చట్టాలకు. పారదర్శకతకు అతీతమా !?



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్

భారత రాజకీయాల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ( ఆర్ఎస్ఎస్)ను గురించిన చర్చ ఎప్పుడూ కొనసాగుతూనే ఉంది. ఇది కేవలం ఒక సంస్థ గురించిన చర్చ మాత్రమే కాదు.దాని అధికార నిర్మాణం, భావజాల ప్రభావం, రాజకీయ జవాబుదారీతనం, ప్రజాస్వామ్య పారదర్శకత వంటి మౌలిక ప్రశ్నల చుట్టూ తిరుగుతుంది. తాము రాజకీయాలకు అతీతమైన సాంస్కృతిక సంస్థ అని... ఆర్ఎస్ఎస్ దశాబ్దాలుగా చెబుతున్నప్పటికీ, దేశ రాజకీయ, పరిపాలనా, విద్యా, కార్మిక, విద్యార్థి, మత రంగాలపై దాని ప్రభావం ఎంత విస్తృతంగా ఉందో చూస్తే ఆ వాదనపై సహజంగానే అనేక ప్రశ్నలు ఉదయిస్తాయి.

ఇటీవలి కాలంలో కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే లేవనెత్తిన ప్రశ్నలు, ఆర్ఎస్ఎస్ సంస్థాగత నిర్మాణం, నిధుల పారదర్శకత, చట్టబద్ధ స్థితి, రాజకీయ ప్రభావం వంటి అంశాలను మళ్లీ జాతీయ చర్చలోకి తెచ్చాయి. ఈ చర్చలో ప్రధానమైన అంశం ఒకటే -- దేశంలోని వేలాది స్వచ్ఛంద సంస్థలు, మానవహక్కుల సంఘాలు, పరిశోధనా సంస్థలు, విద్యాసంస్థలు, మీడియా సంస్థలు ప్రభుత్వ నియంత్రణలకు, ఆర్థిక తనిఖీలకు లోబడాల్సి వస్తుంటే, దేశంలో అత్యంత ప్రభావవంతమైన భావజాల సంస్థగా చెప్పబడే ఆర్ఎస్ఎస్ మాత్రం అదే ప్రమాణాలకు లోబడి ఉండాలి కదా?

గత దశాబ్ద కాలంగా కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధుల నియంత్రణ చట్టం (ఎఫ్.సీ.ఆర్.ఏ.) అమలును మరింత కఠినతరం చేసింది. వేలాది స్వచ్ఛంద సంస్థల లైసెన్సులు రద్దయ్యాయి. అనేక ఎన్జీవోల బ్యాంకు ఖాతాలు స్తంభింపజేయబడ్డాయి. ప్రభుత్వం వాదన ప్రకారం, నిధుల వినియోగంలో పారదర్శకత, జాతీయ భద్రత, చట్టబద్ధత కోసం ఈ చర్యలు అవసరం. అదే సమయంలో ప్రతి సంస్థ తన ఆదాయ-వ్యయాల లెక్కలు, విరాళాల మూలాలు, ఆర్థిక నివేదికలు సమర్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వం నొక్కిచెబుతోంది. ఈ నేపథ్యంలో సహజంగానే ఒక ప్రశ్న ఎదురవుతోంది: ప్రజా జీవితంపై ఇంతటి ప్రభావం చూపే ఆర్ఎస్ఎస్‌కు కూడా ఇదే ప్రమాణాలు వర్తించాలా? లేదా?

ఆర్ఎస్ఎస్‌కు ప్రత్యక్షంగా దేశవ్యాప్తంగా ఒకే రకమైన కేంద్రీకృత ఆర్థిక నిర్మాణం లేదని దాని అనుకూల వర్గాలు చెబుతాయి. కానీ వాస్తవంగా చూస్తే విద్యారంగంలో విద్యా భారతి, విద్యార్థి రంగంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ), కార్మిక రంగంలో భారతీయ మజ్దూర్ సంఘ్, రైతు రంగంలో భారతీయ కిసాన్ సంఘ్, మత రంగంలో విశ్వహిందూ పరిషత్, రాజకీయ రంగంలో బీజేపీ వంటి అనేక అనుబంధ సంస్థల విస్తృత, నెట్‌వర్క్ సంఘ్ పరివార్ రూపంలో పనిచేస్తోంది. ఈ సంస్థలన్నీ చట్టపరంగా వేర్వేరు సంస్థలైనా, వాటి భావజాల దిశ, నాయకత్వ శిక్షణ, కార్యక్రమాల సమన్వయం ఒకే కేంద్రంతో ముడిపడి ఉన్నాయని రాజకీయ శాస్త్రవేత్తలు చాలాకాలంగా విశ్లేషిస్తున్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆర్ఎస్ఎస్‌ను దాని నాయకులు తరచూ వర్ణిస్తుంటారు. అధికారిక సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా లక్షలాది స్వయంసేవకులు, దశలవారీగా పెరుగుతున్న శాఖలు, వేలాది విద్యా-సామాజిక సంస్థలు ఈ నెట్‌వర్క్‌లో భాగంగా ఉన్నాయి. ఇంత పెద్ద సామాజిక శక్తి దేశ విధానాలపై ప్రభావం చూపడం సహజమే. కానీ ప్రభావం ఉన్న చోట జవాబుదారీతనం కూడా ఉండాలి కదా! ప్రజాస్వామ్యంలో శక్తి ఎంత ఎక్కువగా ఉంటే, పారదర్శకత కూడా అంతే అవసరం మరింత ఎక్కువగా ఉంటుంది.





ఆర్ఎస్ఎస్ ఒక రాజకీయ పార్టీ కాదనేది నిజం. అది ఎన్నికల్లో పోటీ చేయదు. అభ్యర్థులను నిలబెట్టదు. కానీ రాజకీయ శాస్త్రంలో రాజకీయ ప్రభావం అంటే కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం మాత్రమే కాదు. విధానాలపై ప్రభావం చూపడం, ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేయడం, నాయకత్వాన్ని తీర్చిదిద్దడం, ఓటర్ల అభిప్రాయాలను మలచడం కూడా రాజకీయ సాంస్కృతి (పొలిటికల్ కల్చర్) లో భాగమైన చర్యలే. ఈ కోణంలో చూస్తే బీజేపీతో ఆర్ఎస్ఎస్ సంబంధం కేవలం భావజాల సాన్నిహిత్యాన్ని మించి ఉందని విమర్శకులు వాదిస్తారు.

బీజేపీకి చెందిన అనేక అగ్రనేతలు ఇప్పటికీ ఆర్ఎస్ఎస్ ప్రచారకులుగా పనిచేసిన నేపథ్యం కలిగి ఉన్నారు. ఎన్నికల సమయంలో వేలాది స్వయంసేవకులు క్షేత్రస్థాయిలో పనిచేస్తారనే విషయం కూడా రహస్యమేమీ కాదు. కీలక విధాన అంశాలపై సంఘ్ పరివార్ సమావేశాలు జరగడం, ప్రభుత్వ నిర్ణయాలపై సంఘ్ నాయకుల అభిప్రాయాలు వెలువడడం కూడా తరచుగా కనిపించే అంశాలే. అందువల్ల ఆరెస్సెస్ తాము రాజకీయాలకు పూర్తిగా అతీతమని చెప్పడం వాస్తవ పరిస్థితులతో పూర్తిగా సరిపోదనే విమర్శ బలపడుతోంది.

ఇక్కడ మరొక ముఖ్యమైన అంశం ఏమిటంటే? నిధుల ప్రశ్న. ఇటీవల రామమందిర నిర్మాణానికి సంబంధించిన విరాళాల వినియోగంపై వచ్చిన ఆరోపణలు నిజమా కాదా అన్నది విచారణల ద్వారా తేలాలి. కానీ అలాంటి ఆరోపణలు రావడమే ప్రజల్లో ఒక సందేహాన్ని సృష్టిస్తుంది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది హిందూ భక్తులు ఇచ్చిన విరాళాలు, బంగారం, వెండి , భూములు, డబ్బు వంటి కానుకలు, ముడుపులు వంటి ఆస్తుల నిర్వహణ విషయంలో అత్యున్నత స్థాయి పారదర్శకత ఎంతో అవసరం. ఎందుకంటే మతపరమైన విశ్వాసం ప్రజాస్వామ్యంలో అత్యంత సున్నితమైన అంశం. అక్కడ నమ్మకం దెబ్బతింటే దాని ప్రభావం కేవలం ఒక సంస్థపై కాకుండా సామాజిక విశ్వాస వ్యవస్థపై పడుతుంది.పైగా ఆరెస్సెస్, బీజేపీ మొదటి నుండి క్రైస్తవ సంస్థలపై, ముస్లిం సంస్థల ఆస్తులపై ( వక్త్ భూములు, విద్యా సంస్థలు, భవనాలు వాటి కార్యక్రమాల) రికార్డ్స్, దస్తావేజులు, ఓనర్ షిప్ పై అనేక ఆంక్షలతో చట్టాలు చేసింది. ఈ నేపథ్యంలో ఆరెస్సెస్ కూడా ఇవే చట్టాలకు, శాసనాలకు, సంప్రదాయాలకు ఏలా అతీతం అవుతుంది!? అని ఇతర మత, సాంస్కృతిక, విద్యా, వైద్య సంస్థలు కూడా బీజేపీ, ఆరెస్సెస్ సంస్థలను ప్రశ్నిస్తున్నాయి.


ఆర్ఎస్ఎస్‌పై ఇలాంటి విమర్శలు కొత్తవి కావు. అదే విధంగా ఆర్ఎస్ఎస్‌కు ఉన్న సామాజిక సేవా కార్యక్రమాలు, విపత్తుల సమయంలో చేసిన సహాయక చర్యలు, గ్రామీణ స్థాయిలో నిర్మించిన కేడర్ వ్యవస్థను ప్రశంసించే వర్గాలు కూడా చాలానే ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో ఏ సంస్థనైనా సంపూర్ణంగా మంచిదిగా లేదా పూర్తిగా చెడ్డదిగా చిత్రీకరించడం సరైన పద్ధతి కాదు. కానీ విమర్శలకు సమాధానం ఇవ్వకుండా, ప్రశ్నలను రాజకీయ కుట్రగా ఒక్క మాటలో కొట్టిపారేయడం కూడా ప్రజాస్వామ్య సంస్కృతి అనిపించుకోదు.


నిజానికి ఈ చర్చ ఆర్ఎస్ఎస్ గురించి మాత్రమే కాదు. భారతదేశంలో అన్ని శక్తివంతమైన సంస్థలకు ఒకే ప్రమాణం ఉండాలా లేదా అన్నదే అసలు ప్రశ్న. దీని గురించి. ప్రభుత్వం ఎన్జీవోల ఆదాయ-వ్యయాల లెక్కలు అడిగితే, విదేశీ నిధుల వినియోగంపై ఆరా తీస్తే, కార్పొరేట్ సంస్థలకు ఆడిట్లు తప్పనిసరి చేస్తే, ప్రజా జీవితంపై ప్రభావం చూపే భావజాల సంస్థలు కూడా అదే స్థాయి పరిశీలనను ఎదుర్కోవాలి. ప్రజాస్వామ్యంలో విశ్వాసానికి మూలం పారదర్శకత. పారదర్శకత లేని ఏ సంస్థ

పైనైనా చివరికి అనుమానాలు తలెత్తడం సహజం. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థలు నేడు ఎదుర్కొంటున్న పెద్ద సవాలు ఇదే. ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చే రాజకీయ పార్టీలు మాత్రమే కాదు, వాటి వెనుక ఉన్న భావజాల,మత, ఆర్థిక, సామాజిక శక్తి కేంద్రాలు కూడా ప్రజా పరిశీలనకు లోబడాలి. భారతదేశంలో ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలపై జరుగుతున్న చర్చను కూడా ఇదే దృక్కోణంలో చూడాలి.

చివరికి ప్రశ్న చాలా సరళమైనది. దేశంలోని సాధారణ ఎన్జీవో నుంచి చిన్న సామాజిక సంస్థ వరకు అందరూ తమ లెక్కలు చూపాల్సిందే అయితే, దేశంలో అత్యంత ప్రభావవంతమైన భావజాల ఉద్యమం కూడా అదే ప్రమాణాన్ని అనుసరించడానికి సిద్ధంగా ఉందా?

ప్రజాస్వామ్యంలో నిజమైన నైతిక అధికారం విమర్శలకు అతీతంగా ఉండటంలో కాదు; ప్రజల ముందు జవాబుదారిగా నిలబడటంలో ఉంది. అదే పరీక్షను నేడు ఆర్ఎస్ఎస్ ఎదుర్కొంటోంది.




# పి.వి. నరసింహారావు: భారత ఆర్థిక సంస్కరణల పితామహుడు

## (జూన్ 28న "పి.వి. నరసింహారావు జయంతి" సందర్భంగా)

ఆచార్య : మధుసూదన్ రెడ్డి బుర్ర

పాములపర్తి వెంకట (పి.వి.) నరసింహారావు తెలంగాణలోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం, లక్నపల్లి అనే ఒక చిన్న గ్రామంలో 1921 జూన్ 28న జన్మించారు. ఆయన తండ్రి సీతారామరావు, తల్లి రుక్మాబాయి వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. ఆ తర్వాత, హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మినమ్మలు ఆయనను దత్తత తీసుకున్నారు. ఆయన కట్కూరు గ్రామంలో తన పాఠశాల విద్యను ప్రారంభించారు. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ. డిగ్రీ, బొంబాయి విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో డిగ్రీ, నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ అభ్యసించారు. 1930, 1940వ దశకాలలో, ఆయన హైదరాబాద్ నిజాంకు వ్యతిరేకంగా, అలాగే వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి పండితుడు, స్వాతంత్ర్య సమరయోధుడు మరియు రాజకీయవేత్త:

పి వి నరసింహ రావు ఒక విశిష్టత కలిగిన స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, భారతదేశ 9వ ప్రధానమంత్రి (1991-96). ఆయనను "భారత ఆర్థిక సంస్కరణల పితామహుడు"గా విస్తృతంగా కీర్తిస్తున్నాం. ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా (1971-73) కూడా పనిచేశారు. ప్రధానమంత్రి కాక పూర్వం కేంద్ర మంత్రివర్గంలో హోం, రక్షణ, విదేశాంగ శాఖల మంత్రిగా కీలక పదవులను నిర్వహించారు. ఆయన ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యుడిగా (1957-77), పార్లమెంట్ సభ్యుడిగా (1977-97), మరియు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా (1991-96) పనిచేశారు. దక్షిణ భారతదేశం నుండి, అలాగే నెహ్రూ-గాంధీ కుటుంబం వెలుపల నుండి ప్రధానమంత్రిగా పనిచేసి తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసిన మొదటి వ్యక్తి ఆయనే.

### ఆర్థిక సంస్కరణలు : ఎల్పీజీ విధానాలు:

రాజీవ్ గాంధీ హత్య అనంతరం, పి.వి. నరసింహ రావు మైనారిటీ ప్రభుత్వానికి సారథ్యం వహించారు. ఆర్థిక మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను జత కలుపుకొని, ఆయన లైసెన్స్ రాజ్‌ను రద్దు చేసి, భారతదేశాన్ని ఆర్థిక దివాలా దుస్థితి నుండి కాపాడడానికి సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) విధానాలను ప్రవేశపెట్టారు. ఈ విధానం భారతదేశాన్ని అధిక నియంత్రణలు గల, పాక్షిక-



సామ్యవాద వ్యవస్థ నుండి స్వేచ్ఛా విపణి ఆర్థిక వ్యవస్థగా మార్చింది. ఆయన ఆగ్నేయాసియాతో దౌత్య, ఆర్థిక సంబంధాలను మెరుగుపరచడానికి "లుక్ ఈస్ట్" విధానాన్ని ప్రారంభించడంతో పాటు, భారతదేశ అణు కార్యక్రమాన్ని కూడా నిశ్శబ్దంగా, సమర్థవంతంగా ముందుకు నడిపించారు. ఆయన ప్రధానమంత్రిత్వ కాలంలో, ముఖ్యంగా అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత, ఆ తర్వాత ఆయన నాయకత్వానికి ఎదురైన సవాళ్ల వంటి అపారమైన సంక్షోభాలను కూడా ఎదుర్కొన్నారు.

పి వి నరసింహ రావుకు 2024లో భారత ప్రభుత్వం మరణానంతరం భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారం "భారతరత్న"ను ప్రదానం చేసింది. రాజకీయాల నుండి విరమించుకున్న తర్వాత, ఆయన "ది ఇన్‌సైడర్" అనే పేరుతో ఒక ఆత్మకథను ప్రచురించారు. ఆయన సత్యమ్మను వివాహం చేసుకున్నారు. ఆ దంపతులకు ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన 2004 డిసెంబర్ 23న, 83 సంవత్సరాల వయస్సులో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. తెలుగు తేజంగా భారతదేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన ఘనుడిగా పివి పేరు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నిరసనగా సిరిసిల్ల బ్రిడ్జి పై ధర్నా

జనసైన్యం సిటి



నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నిరసనగా విద్యార్థుల యొక్క ఆవేదన CHATRON KI GOONZ ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్ ఆధ్వర్యంలో సిరిసిల్ల బ్రిడ్జి పై నిరసన కార్యక్రమం నిర్వహించి బ్రిడ్జి పైన బైఠాయించారు. ఈ సందర్భంగా కౌడగాని వెంకటేష్ మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీ వల్ల 21 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే బర్తరఫ్ చేసి పరీక్షలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.అలాగే సిరిసిల్ల నియోజక వర్గ అధ్యక్షుడు చుక్కా రాజశేఖర్ మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విద్యార్థులకు క్షమాపణ చెప్పి వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని చెప్పి డిమాండ్ చేశారు, 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బిజెపి ప్రభుత్వం చేతగానితనాన్ని విద్యార్థులకు చేసిన మోసాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని త్వరలోనే తగిన బుద్ధి చెప్తారని అన్నారు, బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 80 కి పైగా పరీక్ష పత్రాలు లీక్ అయ్యాయని ఇది బిజెపి ప్రభుత్వం చేతగానితనం అని చెప్పి అన్నారు, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయకపోతే దేశ యువజన కాంగ్రెస్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిరసనలు తెలుపుతామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కౌడగాని వెంకటేష్, యూత్ కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడు చుక్కా రాజశేఖర్, వేములవాడ నియోజవర్గ అధ్యక్షుడు న్యాత నవీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిదులు రెడ్డిమళ్ళ భాను, గుడిసె ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగం మురళి, శేఖర్ శౌర్య నాయక్, ఎడ్ల తిరుపతి, వేములవాడ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్,సిరిసిల్ల టౌన్ అధ్యక్షులు పోగుల దేవరాజు రెడ్డి, తంగలపల్లి మండల అధ్యక్షులు ఎగుర్ల ప్రశాంత్, గంభీరావుపేట మండల అధ్యక్షులు గంగోల్ల స్వామి, చుక్క రామస్వామి,దండుగుల శేఖర్, నక్క సాయి,వీణ సోహెల్ , నక్క నవీన్,శ్యాగ కుమార్, రాగుల చరణ్,షేక్ ఇర్ఫాన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 2న షేర్ అలిబాబా ఉర్స్ ఉత్సవాలు ప్రారంభం

జనసైన్యం సిటి



నగరంలోని కేబుల్ బ్రిడ్జి పక్కనే గల, అలుగునూర్ శివారులోని హజరత్ షేర్ అలీ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు వచ్చే నెల జూలై 2, 3వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు వాజిద్ అలీ శనివారం తెలిపారు. ఈ మేరకు నగరంలో ఎంఐఎం కార్యాలయంలో దర్గా ఉర్సు ఉత్సవాల పోస్టర్ ను ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, దర్గా కమిటీ సభ్యులు కలిసి ఆవిష్కరించారు. జూలై 2న షాసాహేబ్ మొహల్ల నుంచి కమాన్ మీదుగా బైపాస్ రోడ్, అలుగునూర్ చౌరస్తా నుంచి దర్గా వరకు సందల్ మహోత్సవం ర్యాలీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై 3న దర్గాలో దీపాలు (చిరాగ్) వెలిగించే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ దర్గా ఉరుసు ఉత్సవాలకు మానకొండూర్ తిమ్మాపూర్ కరీంనగర్ పెద్దపల్లి సిరిసిల్ల హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరవుతారని చెప్పారు. ఎవరు స్వేచ్ఛ వాళ్లను ప్రతి ఒక్కరూ కుల మతాల కతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని దర్గా అధ్యక్షుడు వాజిద్ అలీ కోరారు. ఈకార్యక్రమంలో దర్గా ప్రధాన కార్యదర్శి నదీమోద్దీన్ ఖాద్రి, సభ్యులు యూసుఫ్ బేగ్, అలీ, ఆయూబ్ ఖాన్, ఫహీం, మూసా తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి లీగల్ సెల్ మీడియా కన్వీనర్ కొత్త ప్రకాశ్ ఘనంగా జన్మ దిన వేడుకలు.



**జనసైన్యం సిటి**

డిసిసి లీగల్ సెల్ మీడియా కన్వీనర్, కరీంనగర్ బార్ అసోసియేషన్ మాజీ సెక్రెటరీ, సీనియర్ న్యాయవాది కొత్త ప్రకాశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో కొత్త ప్రకాశ్ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, సీనియర్ న్యాయవాదులు పెంచాల ప్రభాకర్ రావు, గంజి స్వరాజ్ బాబు , యం సత్యనారాయణ, పేరుక రాజన్న, కొత్తకొండ పరిశరాం చెప్యాల శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, గిన్నె సతీష్, చెట్టిపెల్లి కిరణ్, నరసింహారెడ్డి, కృష్ణ, రామచంద్ర రెడ్డి, శ్రీధర్, సతీశ్ , తదితరులు పాల్గొని కొత్త ప్రకాశ్ కు జన్మ దిన శుభాకాక్షలు తెలిపారు.

## ఉద్యోగం చేపట్టడం .. విరమణ పొందటం సహజం



**జనసైన్యం సిటి**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలములోని రేపాక గ్రామములో ఉన్న zphs పాఠశాల లో సోమవారం రోజున పదవి విరమణ చేయనున్న శ్రీమతి శ్రీ A రేవతి దేవి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ వారు ఈ పాఠశాలకు 2023వ సంవత్సరం సెప్టెంబర్ నెలలో 25రోజున ఇక్కడ కు రావడం జరిగింది అని వారు వచ్చాక పాఠశాలలో ఎన్నో సేవలు చేశారని చదువుకున్న విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారని అలాగే గత నెలలో పదవ తరగతిలో జిల్లాలో అలాగే ×× లో తెలంగాణ రాష్ట్రంలో రెండవ ర్యాంక్ సాధించడం జరిగింది అని అన్నారు...వీరి ఆధ్వర్యంలో పిల్లలకు మంచి చదువు ఫలితాలు సాధించడం జరిగింది అని కానీ ఈ నెల సోమవారం రోజున పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీ రేవతి దేవి గారు పదవి విరమణ చేయనున్న సందర్భంగా వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి శేష జీవితాన్ని కూడా ఆయురారోగ్యాలతో కలకాలం బాగుండాలని ఉపాధ్యాయ బృందం కోరుకుంటున్నామని ....అలాగే పదవి విరమణ సోమవారం రోజున పాఠశాల కు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు తదితరులు అందరూ పాల్గొనాలని కోరారు.. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రేవతి దేవి...ఉపాధ్యాయులు .వీరారెడ్డి, మల్లికార్జున్, రామేశ్వర రెడ్డి, అబ్రార్ హైమద్,మల్లయ్యా.,సుజాత..మాధవి. రాధారాణి...

## పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో ఎంబీఏ సీటు సాధించిన ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థి కె. మనోజ్ కుమార్



**జనసైన్యం సిటి**

ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బి.ఏ. విద్యార్థి కె. మనోజ్ కుమార్ ప్రతిష్ఠాత్మకమైన పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశం పొందడం పట్ల కళాశాల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ, గ్రామీణ నేపథ్యం నుంచి ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచి దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తే ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. మనోజ్ కుమార్ తన విద్యాభ్యాసంలో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.వైస్ ప్రిన్సిపల్ డా. నితిన్ పాఠక్ మరియు టి రాజయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కె. సురేందర్ రెడ్డి, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి ఎం. శ్రీనివాస్ రెడ్డి, సి ఓ ఈ డాక్టర్ శ్రీనివాస్ మరియు ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు వి రాజేశం కే సుధాకర్ ఏ రామ్ కిషన్ జి .రాజేందర్ సిహెచ్ .ప్రవీణ ఏ. సోమ నరసయ్య శ్రీనివాస్ రావు, సతీష్ రెడ్డి, శ్రీనివాస్, వినయ్ కుమార్లు విద్యార్థి మనోజ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్పేస్ ల్యాబ్‌ను ప్రారంభించిన పారమిత హెరిటేజ్ పాఠశాల

**జనసైన్యం సిటి**







పాఠశాల విద్యా రంగంలో ఒక సరికొత్త మైలురాయిని అధిగమిస్తూ, స్థానిక నగరంలోని కరీంనగర్, పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల నేడు అత్యాధునిక 'పారమిత స్పేస్ ల్యాబ్'ను ప్రారంభించింది. పాఠశాల స్థాయిలో అంతరిక్ష విద్యను (స్పేస్ ఎడ్యుకేషన్) పరిచయం చేసిన మొట్టమొదటి విద్యాసంస్థగా పారమిత హెరిటేజ్ పాఠశాల కరీంనగర్ జిల్లాలోనే సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ ల్యాబ్ ప్రారంభం విద్యార్థులలో భవిష్యత్తుకు అవసరమైన శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడానికి మరియు ప్రయోగాత్మక అభ్యాసాన్ని అందించడానికి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది.

విద్యార్థులలో చిన్న వయస్సు నుంచే ఉత్సుకతను రేకెత్తించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి మరియు శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడానికి ఈ స్పేస్ ల్యాబ్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. యాక్టివిటీ-బేస్డ్ మరియు ప్రాక్టికల్ లెర్నింగ్ ద్వారా విద్యార్థులు అంతరిక్ష శాస్త్రం, ఖగోళ శాస్త్రం, శాటిలైట్ టెక్నాలజీ, రాకెట్రీ, రోబోటిక్స్ మరియు అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన అంశాలపై పట్టు సాధిస్తారు. ఇది అభివృద్ధి చెందుతున్న సరికొత్త సాంకేతికతలపై వారికి లోతైన అవగాహనను కల్పిస్తుంది. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు మాట్లాడుతూ, "అంతరిక్ష విద్య అంటే కేవలం గ్రహాలు, నక్షత్రాల గురించి చదువుకోవడం మాత్రమే కాదు; ఇది విద్యార్థులు పెద్ద కలలు కనేలా, శాస్త్రీయంగా ఆలోచించేలా మరియు రేపటి భవిష్యత్తు ఉద్యోగాలకు సిద్ధమయ్యేలా ప్రేరేపిస్తుంది. ఇది ఏరోస్పేస్ ఇంజనీరింగ్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), ఖగోళ శాస్త్రం, ఆస్ట్రోఫిజిక్స్ వంటి అనేక అత్యాధునిక రంగాలలో వైవిధ్యమైన కెరీర్ అవకాశాలకు ద్వారాలు తెరుస్తుంది" అని అన్నారు.



పారమిత హెరిటేజ్ పాఠశాల ప్రిన్సిపాల్ పి. గోపికృష్ణ మాట్లాడుతూ.. విద్యా రంగంలో అత్యుత్తమ ప్రమాణాల కోసం నిరంతరం కృషి చేస్తూ, ఈ అద్భుతమైన ల్యాబ్ ఏర్పాటుకు కారణమైన దార్శనిక చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పారమిత స్పేస్ ల్యాబ్ స్థాపన అనేది విద్యార్థులకు ప్రపంచ స్థాయి అభ్యాస అవకాశాలను అందించడానికి మరియు ఆవిష్కరణల ద్వారా వారిని భవిష్యత్తుకు సిద్ధం చేయడానికి మా సంస్థ కట్టుబడి ఉందనే విషయానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ పారమిత స్పేస్ ల్యాబ్ ప్రారంభంతో, పారమిత హెరిటేజ్ పాఠశాల వినూత్న విద్యా విధానంలో మరోసారి తన అగ్రగామి స్థానాన్ని చాటుకుంది. విద్యార్థుల జిజ్ఞాసకు ఆవిష్కరణలు తోడయ్యేలా ఒక గొప్ప వాతావరణాన్ని సృష్టిస్తూ.. రేపటి తరం శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, ఆవిష్కర్తలు మరియు అంతరిక్ష పరిశోధకులుగా వారు ఎదగడానికి పారమిత హెరిటేజ్ పాఠశాల స్ఫూర్తినిస్తోంది. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ. ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, రష్మిత, రాకేష్, అనుకర్ రావు, వినోద్ రావు, వి.యు.యం. ప్రసాద్, హన్మంతరావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు,ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




రూపిరెడ్డి శ్రీనివాస్ ప్రభావతి దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు వివిధ రకాల ఒలంపియాడ్లలో ప్రశంసా పత్రాలు

జనసైన్యం సిటి




విద్యార్థులకు వివిధ అంశాల పట్ల విస్తృతమైన అవగాహన ఉండాలని తద్వారా వారు వివిధ విషయాలలో విజయం సాధిస్తారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులకు వివిధ ఒలింపియాడ్లలో ప్రశంసాపత్రాలు రావడం పట్ల ఏర్పాటు చేసినటువంటి అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ ఉండే వివిధ రకాల పోటీ పరీక్షల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలో పాల్గొని విజేతలుగా నిలబడేదందుకు కృషి చేయాలని వారు చెప్పారు. ప్రతి విద్యార్థి కూడా తరగతి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను అనునిత్యం సాధన చేయాలని మరియు పట్టు సాధించాలని వారు చెప్పారు. పట్టు సాధించడం ద్వారా సంస్థల వారు నిర్వహిస్తున్నటువంటి పోటీ పరీక్షలకు సైతం హాజరై ఉత్తమంగా నిలవచ్చని వారు చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా విషయాలను సాధన చేస్తూ పోటీ పరీక్షల్లో విజయం సులభంగా సాధించాలని వారు చెప్పారు.

జనరల్ నాలెడ్జ్ ఒలంపియాడ్ ఎస్వీ.కృష్ణచైతన్య మరియు ఈ. లిఖిత్ కుమార్: ప్రశంసా పత్రాలు ,రీజనింగ్ ఒలింపియాడ్: రోహిత్ చంద్ర, లిఖిత్ కుమార్: ప్రశంసా పత్రాలు, సైన్స్ ఒలంపియాడ్ లిపి.గౌరీ, ఏ.రిషిత్ చంద్ర, ఎన్. వినాయక్ ఓ ఎన్. సద్రాస్, విజయ్ నిలిచినటువంటి విద్యార్థులకు పుష్పగుచ్ఛాలతో పాటు పతకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్తులోనూ అద్భుతమైనటువంటి విధానం నమోదు చేసి తల్లిదండ్రులు యొక్క ఆశయాలకు అనుగుణంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు..

## డి ఎ బకాయిలను ఏక మొత్తంగా చెల్లించాలి



జనసైన్యం సిటి

గతంలో ప్రభుత్వం ప్రకటించిన డిఏ లను 17, 28, 30 వాయిదాలు కాకుండా ఒకేసారి బిల్లు చేసి ఏక మొత్తంలో చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోహెడ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి బిక్షపతి ఈరోజు సెక్రటేరియట్లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి ప్రాతినిధ్యం చేశారు. 2024 మార్చి నుంచి రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రకటించిన డి ఏ లు వాయిదాల ప్రకారం కాకుండా ఏకమొత్తంగ చెల్లించాలని కోరారు. ప్రస్తుతం పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులకు డిఏలను ఏక మొత్తంగా వారి జిపిఎఫ్ ఖాతాలో జమ చేశారని , అదేవిధంగా మాకంటే ముందు 2024 కంటే ముందు రిటైర్మెంట్ అయిన పెన్షనర్లకు ఎస్టీఓ ల ద్వారా డిఏ బకాయిలను ఏక మొత్తంగా వారి అకౌంట్లో జమ చేశారని 2024 మార్చి తర్వాత రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు ఉపాధ్యాయులకు రావలసిన డిఏలు వాయిదాల పద్ధతిలో బిల్లులు చేసినప్పటికీ ఏ ఒక్కటి కూడా మంజూరు చేయడం లేదని,ఈరోజు గౌరవనీయులు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గారికి ప్రాతినిధ్యం చేశారు.

అదేవిధంగా 2024 నుండి రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు ఉపాధ్యాయులకు వంద రోజుల్లో 6 వేల కోట్లు ఇస్తానని ప్రభుత్వం ప్రకటించి ఇప్పటివరకు రెండు వేల కోట్లను మాత్రమే చెల్లించిందని అదేవిధంగా రిటర్మెంట్ అయినా ఉద్యోగులు ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలను 100 రోజుల్లో అందరికీ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కోహడ చంద్రమౌళి ప్రధాన కార్యదర్శి కొంపెల్లి బిక్షపతి ఆర్థిక కార్యదర్శి గంగ్ర రవీందర్రావు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కందుకూరి దేవదాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకిశాల ప్రభాకర్ రావు జాయింట్ సెక్రెటరీ శంకరయ్య శ్రీధర్ రావు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైన్, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

జనసైన్యం సిటి



కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నగరంలోని 48వ డివిజన్ కురుమవాడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో రూ.20 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న పైప్ లైన్ డ్రైన్ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. చేపట్టిన పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు , 48వ డివిజన్ కార్పొరేటర్ కర్రె పద్మ అనిల్ , కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాశ్ , బండ రమణా రెడ్డి , గాజ రమా శివరామ్ , పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్ , మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

## బాలలకు స్నేహపూర్వక న్యాయ సేవలపై అవగాహన

జనసైన్యం సిటి



కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నేడు మంకమ్మతోట (ధన్గర్వాడి) ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు " బాలలకు స్నేహపూర్వక న్యాయ సేవలు (చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్)" అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివ కుమార్ గారి అనుమతితో, కార్యదర్శి, న్యాయమూర్తి కే. రాణి గారి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని బాలల న్యాయ సేవల విభాగం ఆధ్వర్యంలో చేపట్టారు . ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, ప్యానెల్ న్యాయవాదులు చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య, బి.శాంతి కుమార్, టి. పోల్గొని అశ్విని మాట్లాడారు. బాలల హక్కులు, బాలల భద్రత, ఉచిత న్యాయ సేవలు, బాల్య వివాహాల నివారణ, యాసిడ్ దాడుల బాధితులకు చట్టపరమైన రక్షణ, పోక్సో చట్టం–2012 లోని ముఖ్య నిబంధనలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ మార్గదర్శకాల మేరకు ఏర్పాటు చేసిన లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ గురించి వివరించారు. ప్రమాదంలో ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్, రక్షణ, పునరావాసం అందించడంతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం ద్వారా అవసరమైన సేవలు అందించడంలో లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నల్సా అమలు చేస్తున్న వివిధ న్యాయ సేవా పథకాల ద్వారా అర్హులైన పిల్లలు, మహిళలు మరియు ఇతర వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సహాయం, మధ్యవర్తిత్వ సేవలు, లోక్ అదాలత్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలపై ఎలాంటి వేధింపులు, దుర్వినియోగం లేదా హింస జరిగినా వెంటనే సంబంధిత అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ -1098కు సమాచారం అందించాలని కోరారు. ప్రతి చిన్నారి హక్కులను పరిరక్షించడం కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు యం. శ్రీనివాస్, ఉపాధ్యాయులు రవీందర్, శ్రీలత, పారా లీగల్ వాలంటీర్ లు సంజయ్ కుమార్, శామీమ్, స్వప్న మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ గోదాం హమాలి కార్మికులకు పని భద్రత కల్పించాలి.



జనసైన్యం సిటి

రాష్ట్రంలోని ఫర్టిలైజర్ అండ్ సీడ్స్ గోదాముల్లో పనిచేస్తున్న హమాలి కార్మికులకు పని భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం రోజున కరీంనగర్ ప్రధాన వ్యవసాయ మార్కెట్ కమిటీ లోని గోదావరి కరీంనగర్ జిల్లా ఫర్టిలైజర్స్&సీడ్స్, ఏఐటీయుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏఐటీయుసి రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రాన్ని కార్మికులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టేకుమల్ల సమ్మయ్య,కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్ గోదాముల్లో,కంపెనీల్లో పనిచేస్తున్న హమాలి కార్మికులకు పని భద్రత లేకుండా పనులు చేస్తున్నారని వీరికి ఫెర్టిలైజర్స్ కంపెనీ గాని ఫర్టిలైజర్ డీలర్స్ గాని ఎలాంటి పని భద్రత కల్పించకుండా లారీ దించేటప్పుడు అనేకమైనటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయి కాబట్టి వీరికి ప్రమాద బీమా సౌకర్యం, పీఎఫ్, సౌకర్యం కల్పించాలని, కల్పించే విధంగా కార్మిక శాఖ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ రానున్న రోజుల్లో రాష్ట్రంలోని పెర్టిలైజర్ సీడ్స్ కంపెనీ గోదాములలో పనిచేస్తున్న కార్మికులందరినీ ఐక్యం చేసి కార్మికుల సమస్యలపై పోరాటాల నిర్మిస్తామని ఈ డిమాండ్ల పైన సెప్టెంబర్ లో జరిగే రాష్ట్ర మహాసభల్లో సమస్యలపై తీర్మానం చేయడం జరుగుతుందని వారు తెలిపారు. రాష్ట్రంలోని పెర్టిలైజర్స్,సీడ్స్ కంపెనీలలో గోదాముల్లో పనిచేస్తున్న కార్మికులందరూ కలిసి కట్టుగా వచ్చి సెప్టెంబర్ 6,7,8 తేదీలలో కరీంనగర్ నగరంలో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభలలో పాల్గొని జయప్రదం చేయాలని సమ్మయ్య, బుచ్చన్న పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం లో కరీంనగర్ జిల్లా పెర్టిలైజర్, ఫర్టిసైడ్ గోదాంల హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు కదారి బీరయ్య, ఉపాధ్యక్షులు ఆవుల లక్ష్మణ్, కార్యదర్శి, రాజు కోతాదికారిమామిళ్లపల్లి శంకరయ్య నాయకులు రాయమల్లు, పి మహేష్, కదారి కొమురయ్య,బి అంజయ్య, పుల్ల మహేష్, రేషవేని సదయ్య ,వేల్పుల రాజయ్య ,కే ఐలయ్య, ఆర్ రాములు హమాలి కార్మికులు పాల్గొన్నారు.




## వి బి గ్రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని జులై ఒకటో తేదీన కలెక్టర్ ఆఫీస్ ముందు భారీ ధర్నా

జనసైన్యం సిటి




గ్రామీణ ఉపాధిహామీ కార్మికులకు నష్టం కలిగించే వి బి రామ్ జి చట్టాన్ని రద్దు  డిమాండ్ చేస్తూ జూలై ఒకటవ తేదీన జిల్లా కలెక్టరేట్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి సంపత్ పిలుపునిచ్చారు. ఈరోజు స్థానిక జిల్లా కార్యాలయంలో జరిగిన ఆఫీస్ బేరర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీస సౌకర్యాలు లేకుండా, పనిచేయడానికి కనీస పనిముట్లు ఇవ్వకుండా, రోజుకు రెండుసార్లు అటెండెన్స్ పెట్టి, ఉపాధిహామీ చట్టానికి కేటాయించాల్సిన నిధులను 90% ఉంది 60 శాతానికి కుదిరిస్తూ యూనియన్ గవర్నమెంట్ బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన వి బి గ్రామ్ జి చట్టాన్ని రద్దు చేసి గతంలో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని దాని అమలుకు యూనియన్ గవర్నమెంట్ నిధులని రెండు లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని కలెక్టరేట్ కార్యాలయాల ముందు ధర్నాలు చేస్తున్నామని ఆ ధర్నాల జయప్రదం కోసం అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నుండి ఉపాధి హామీ చట్టానికి ఉన్న నిధులని తగ్గించుకుంటూ వచ్చి ఈ సంవత్సరం ఉన్న చట్టాన్ని మొత్తం రద్దు చేసి పేదలకు ఉన్న ఉపాధి భరోసాను రద్దు చేసే విధంగా ఈ కొత్త చట్టం తీసుకువచ్చింది అన్నారు ఈ చట్టాన్ని జులై ఒకటో తారీకు నుండి అమలు చేస్తామని ప్రకటించింది అన్నారు. దీని అమలులో నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి వివి గ్రామ్ జి చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని యూపీఏ-1 ప్రభుత్వంలో ఈ చట్టం తీసుకొచ్చిందని ఈ చట్టాన్ని రద్దు చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారని అన్నారు .రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని చూస్తే పేదల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన చట్టాల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని అన్నారు. ఇప్పటికైనా ఈ చట్టం రద్దు కోసం కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో పోరాటాలు కొనసాగించాలని అఖిలపక్ష పార్టీలను పిలిచి ఐక్య ఉద్యమం ద్వారా బిజెపి ప్రభుత్వం మొండి వైఖరిని తిప్పి కొట్టాలని డిమాండ్ చేశారు... ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు రాయి కంటి శ్రీనివాస్ జిల్లా కోశాధికారి మాతంగి శంకర్ జిల్లా నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.....

## చొప్పదండి గురుకుల పాఠశాలలో ఇంటర్ సైన్స్ వింగ్ అడ్మిషన్లు పున:ప్రారంభించాలి

**జనసైన్యం సిటి**



చొప్పదండి పట్టణ సమీపం లోని కొలిమికుంట గురుకుల పాఠశాలలో  హాస్టల్ వసతి లేదనే కారణం తో నిలుపుదల చేసిన ఎంపీసీ బైపీసీ సెక్షన్లలో అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని ఎంపీటీసీ ఫోరం మాజీ మండల అద్యక్షులు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు  సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.క్రితం సంవత్సరం కూడా  హాస్టల్ వసతి లేదని అడ్మిషన్లు తీసుకోలేదని సంవత్సరం గడిచినప్పటికి వసతి ఏర్పాటు చేయడం పై కానీ నూతన అడ్మిషన్ల పై కానీ దృష్టి సారించిన నాధుడు లేడని ఆయన వాపోయారు.పాలకుల నిరక్షం వలన 160 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కోల్పోయారని కరీంనగర్ జిల్లా కలెక్టర్ సత్వరం స్పందించి గురుకుల పాఠశాల లో  ఇంటర్ సైన్స్ విభాగం అడ్మిషన్లు ప్రారంభించ చేయాలని సింగిరెడ్డి కృష్ణారెడ్డి, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు మొగిలి మహేష్, దొంతిసారపు సంపత్ లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## రేవేంత్ రెడ్డి ప్రభుత్వంను ప్రశ్నిస్తున్నందుకే ఆర్ఎస్పి పై కుట్ర

జనసైన్యం సిటి



కరీంనగర్ బస్టాండ్ ప్రాంతంలో ఒక ప్రవేట్ హాల్ లో జరిగిన పత్రికేయుల సమావేశంలో  ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి కొంకటి శేఖర్ మాట్లాడుతూ ఆర్ఎస్పి గారి భద్రత కుదించాడము అంటే ఇది బహుజనుల గొంతుక డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పైన దాడి మాత్రమే కాదు. అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడి గా పరిగణించాలి అంటే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సమాజం పైన దాడిగా పరిగణించాలి.

RS ప్రవీణ్ కుమార్  దేశ భద్రత కోసం 26 సంవత్సరాలు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరోచితంగా విధులు నిర్వహించిన ఒక అధికారికి నిజమైన భారతీయుడికి దక్కాల్సిన గౌరవాన్ని భంగపరచడం అంటే దేశాన్ని దేశప్రతిష్టను అగౌరవపరిచినట్లే, దేశం లో అత్యున్నత కలిగిన ప్రెసిడెన్షియల్ మెడల్ అందుకున్నారు.. ప్రభుత్వం పై ,జరుగుతున్న అవినీతి పై మాట్లాడితే కక్ష్య పూరిత చర్యగా భావించడం సిగ్గు చేటు..సిర్పూర్ నియోజకవర్గం లో M L A పోటీ చేశారు దేశం లో అది ఎక్కువగా అడవులు ఉన్నటువంటి ప్రాంతానికి వెళ్తూ వస్తూ ఉంటారు. అయిన మీకు ఇంటెలిజెన్స్ ఏమైనా చెప్పిందా రిటైర్డ్ IPS ప్రవీణ్ కుమార్ కి సెక్యూరిటి మరియు బుల్లెట్ ప్రూఫ్ వాహనం తీసివేయ్యాలి,సీఎం ప్రెస్ మీట్ పెట్టి చెప్పండి  RS ప్రవీణ్ కుమార్ గారికి ఏమైనా పూర్తి బాధ్యత నాదే అని,మేము మా నాయకున్ని మా గుండెల్లో పెట్టి మేము చూసుకుంటాం .ఒక IPS  అధికారిగా RS ప్రవీణ్ కుమార్ సార్ గుర్తింపు పొందిన ప్రధాన పురస్కారాలు (Medals/Awards)

ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ 1995 బ్యాచ్ IPS అధికారి. ఆయనకు ప్రధానంగా లభించిన గౌరవాలు:

Presidentµs Police Medal for Meritorious Service (రాష్ట్రపతి పోలీసు పతకం) -- విశిష్ట పోలీసు సేవలకు.

Telangana Excellence Award - తెలంగాణ ప్రభుత్వంచే ప్రదానం చేసిన పురస్కారం. ఇవన్నీ అలాంటిది ప్రభుత్వంలో జరుగుతున్న లోపలపై పోరాడినశీదుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంను ప్రశ్నింస్తున్నశీదుకు ఇవాళ ఆర్ఎస్పి గారికి బుల్లెట్ ప్రూఫ్ కార్ .గన్మెన్ లను తీసివేసే కుట్ర పన్నుతూన్నారు రేవంత్ రెడ్డి కి RSP గారిని ఎదుర్కునే దమ్ము లేకనే ఇవ్వాళ ఇలాంటి కక్ష సాధింపు చర్యలు పాలు పడుతున్నారు అని మండి పడ్డారు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కొడుకు మీద ఆర్ఎస్పి  వాస్తవాలు మాట్లాడి మైనర్ బాలికకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేసినందుకు అప్పటినుండి రేవంత్ రెడ్డి ఆర్ఎస్పి గారిని బహిరశీగశీగా విమర్శలు చేస్తూ అతన్ని డైరెక్ట్ ఎదురుకునే సాహసం చేయకుండా ఇలాంటి పిరికి పంది చర్యలు చేపడుతూన్నారు తన దోస్తు బండి సంజయ్ మద్దతుగా ఆర్ఎస్పి ని ఇబ్బంది చేస్తున్నారు ఖబర్ధార్ రేవశీత్ రెడ్డి ఆర్ఎస్పి కి ఎమన్నా జరగారంది ఎమన్నా జరిగిన కాంగ్రెస్ నాయకుల ఇండ్లు ముట్టడి చేస్తాం జవీ కార్యలయం ముట్టడి చేస్తాం అని అన్నారు ఇ కార్యక్రమంలో విద్యర్తి యువ నాయకులూ గుడిసె విష్ణు .చుక్క శ్రీనివాస్ .కల్లేపల్లి తిరుపతి .కల్లేపల్లి అరవింద్ .బొశీకూరి మోహన్ .చిట్యాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఓటర్ల అందరిని ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**జనసైన్యం సిటి**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - SIR ప్రక్రియలో భాగంగా ఈరోజు కరీంనగర్ కార్పొరేషన్‌కు సంబంధించిన SIR పర్యవేక్షకులతో సమావేశం నిర్వహించడం జరిగింది. BLA-2 లతో పాటుగా ప్రతి 10 బూత్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి ఆదేశానుసారం ఈ సూపర్‌వైజర్ల నియామక ప్రక్రియ చేపట్టామన్నారు.
దీూా లతో సమన్వయం చేసుకుంటూ, మన పార్టీ INC BLA-2 లు అర్హులైన ఓటర్ల అందరిని ఓటర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటరు జాబితాలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లలో చైతన్యం కల్పించి, ా×= కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూపర్‌వైజర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ జు=ూ కో-ఆర్డినేటర్ సిరాజ్, కార్పొరేటర్లు వరాల నర్సింగ్, జగన్ రెడ్డి, గుమ్మడి రాజకుమార్, బుచ్చిరెడ్డి ప్రసాద్, ఇక్రమ్, సికందర్, ఇమ్రాన్, రామ్ రెడ్డి, స్వామి గౌడ్, కాంగ్రెస్ నాయకులు కపిల్ మాధవ్, పెంట శేఖర్, దేవేందర్, వసీం శ్రీకాంత్ శ్రీధర్ రెడ్డి అమర్ మలోతు మహాలక్ష్మి అన్న జ్యోతి మూల రవీందర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు పూర్తి చేసిన కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం.

**తిమ్మాపూర్ జన సైన్యం**



పోలీస్ శాఖలో పరిపాలనా దక్షత, పారదర్శకతను పెంపొందించే భాగంలో భాగంగా శనివారంనాడు తిమ్మాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీలను సీపీ గౌష్ ఆలం నిర్వహించారు. ఈ సమగ్ర సమీక్షలో కార్యాలయ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, మరియు ప్రజల ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియల సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల్లో భాగంగా కార్యాలయ ప్రాంగణంలోని అంతర్గత, బాహ్య పరిసరాల పరిశుభ్రతను సీపీ నిశితంగా పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలోని స్టేషన్ రికార్డులు, పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు మరియు వాటి దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. తిమ్మాపూర్ సర్కిల్ పరిధిలోకి వచ్చే మూడు పోలీస్ స్టేషన్లయిన తిమ్మాపూర్, ఎల్.ఎమ్.డి కాలనీ మరియు చిగురుమామిడిల పనితీరుపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించిన సీపీ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, మరియు స్థానిక సమస్యల పరిష్కారంపై చర్చించారు. ప్రస్తుతం సర్కిల్ పరిధిలోని అన్ని రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉందని, కేసుల దర్యాప్తు పురోగతి సంతృప్తికరంగా ఉందని సీపీ పేర్కొన్నారు. సుమారు నెల రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించిన కొత్త సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్, అప్పుడే సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటుండటాన్ని ఈ సందర్భంగా అభినందించారు. మరింత సమర్థవంతమైన, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ వ్యవస్థను అందించేందుకు గౌరవ డి.జి.పి (DGP) జారీ చేసిన ఆదేశాలను ఈ తనిఖీల్లో భాగంగా చర్చించామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తూ, గ్రామాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు సీపీ జారీచేశారు. మొత్తంగా తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయ పనితీరు మరియు సన్నద్ధత ప్రశంసనీయంగా ఉందని సీపీ సంతృప్తి వ్యక్తం చేస్తూ స్థానిక అధికారులు మరియు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్, ఎస్సైలు అన్వర్, గన్నేరువరం ఎస్సై నరేందర్ రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో అక్కన్నపేట తహసీల్దార్ నూతన భవనానికి నిధులు మంజూరు



**జనసైన్యం సిటి**
మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి రూ. 2.25 కోట్లు మంజూరు. రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ గారి ప్రత్యేక కృషి ఫలితంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 2.25 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 10 రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు (ఆర్డీవోలు), 107 తహసీల్దార్ కార్యాలయాలకు నూతన భవనాల నిర్మాణం కోసం మొత్తం రూ. 263.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జి.ఓ. విడుదల చేసింది. ఈ నిర్ణయంలో భాగంగా అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయానికి రూ. 2.25 కోట్ల నిధులు కేటాయించడం విశేషం. కొత్తగా ఏర్పడిన అక్కన్నపేట మండలంలో ఆధునిక వసతులతో కూడిన తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం ద్వారా ప్రజలకు మెరుగైన, వేగవంతమైన రెవెన్యూ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు ఎదురవుతున్న కార్యాలయ వసతి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయ భవనానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కి హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు, అక్కన్నపేట మండల ప్రజాప్రతినిధులు, రైతులు మరియు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో మంత్రి పొన్నం ప్రభాకర్ నిరంతరం ప్రత్యేక చొరవ చూపుతున్నారని వారు కొనియాడారు.

## అచీవర్స్ స్కూల్‌లో అలయన్స్ గ్రీన్ పోస్టర్ అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ




**జనసైన్యం సిటి**
అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137-A, కరీంనగర్ మరియు వాసుదేవా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న "అలయన్స్ గ్రీన్ అవార్డ్స్" పోస్టర్ డ్రాయింగ్ పోటీని అచీవర్స్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభించారు.
అలయన్స్ ఇంటర్నేషనల్ ఈ ఏడాది "ప్రకృతి ప్రేరణ - మన భవిష్యత్తు కోసం వాతావరణం" (Inspired by Nature for Climate for Our Future) అనే థీమ్‌తో ఈ పోటీని నిర్వహిస్తోంది.
ఈ పోటీలో 4 నుండి 8 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు మొదటి కేటగిరీగా, 9 నుండి 13 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు రెండవ కేటగిరీగా పాల్గొనవచ్చు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఈ పోటీలో పాల్గొనే అవకాశం కల్పించారు. విద్యార్థులు రూపొందించిన పోస్టర్లను జూలై 13వ తేదీలోపు అలయన్స్ జిల్లా గవర్నర్ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. అనంతరం వాటిని ఇంటర్నేషనల్ స్థాయికి పంపిస్తారు. విజేతలకు మొదటి బహుమతి రూ.25,000, రెండవ బహుమతి రూ. 15,000, మూడవ బహుమతి రూ. 5,000 నగదు బహుమతులుగా అందజేయబడతాయి.
ఈ సందర్భంగా డాక్టర్ ఎలగండుల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థుల ఉత్తమ చిత్రాలను అలయన్స్ ఇంటర్నేషనల్ మ్యాగజైన్‌లో ప్రచురిస్తామని తెలిపారు. ప్రకృతి మనకు ప్రసాదించిన గాలి, నీరు, చెట్లు, భూమి వంటి అమూల్యమైన వనరులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. "పచ్చదనాన్ని పరిరక్షిద్దాం - మన భవిష్యత్తును కాపాడుదాం" అనే సందేశంతో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలయన్స్ గ్రీన్ పోస్టర్ అవార్డును జిల్లా స్థాయిలో తొలిసారిగా అచీవర్స్ స్కూల్‌లో స్కూల్ చైర్మన్ శ్రీ చెరిమాల వెంకటేశ్వర్లు అధికారికంగా ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ శ్రీనివాస్, స్కూల్ చైర్మన్ చెరిమాల వెంకటేశ్వర్లు, జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్, ఇంజనీర్ కోలా అన్నారెడ్డి, కుమారస్వామి, నాగేశ్వర్, పులాల శ్యామ్, సుద్దపల్లి ప్రసాద్, అల్లాడి ఆనంద్ కుమార్, అచీవర్స్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతిభ కనబరిచిన అచీవర్స్ స్కూల్‌కు చెందిన సుమారు 50 మంది విద్యార్థులకు ప్రశంసా సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

## వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాం

**జనసైన్యం సిటి**




రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి, రోడ్లపైకి వర్షపు నీరు చేరకుండా ఉండేందుకు అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. డ్రైనేజీల పూడికతీత పనులను పరిశీలించిన సందర్భంగా సిల్ట్ కంటే భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నాయని మేయర్ ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఇంటింటికీ లి'స్వచ్ఛ ఆటోలు'లి ద్వారా చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ, కొందరు నిర్లక్ష్యంగా ప్లాస్టిక్ కవర్లు, చెత్తను డ్రైనేజీల్లో వేయడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమని, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. అందువల్ల నగర ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, "ప్లాస్టిక్ రహిత కరీంనగర్" లక్ష్య సాధనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చెత్త సేకరణలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే స్థానిక కార్పొరేటర్ల దృష్టికి తీసుకువస్తే వెంటనే స్వచ్ఛ ఆటోలను పంపించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. నగర పరిశుభ్రతను కాపాడేందుకు రోడ్లపై, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేదా ఇతర చెత్తను వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నగర ప్రజలకు మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారితో పాటు స్థానిక కార్పొరేటర్ బండారి వేణు, మాజీ కార్పొరేటర్ జితేందర్, సాదవేని శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## 50వ డివిజన్‌లో ఎస్.ఐ.ఆర్ పై అవగాహన



**...న్యం సిటి**
కరీంనగర్ నగర పాలక సంస్థ 50వ డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్ నంబర్ 170లో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై ప్రజలకు, ఓటర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్.ఐ.ఆర్ ఆవశ్యకతను, దాని ప్రయోజనాలను ప్రజలకు వివరంగా తెలియజేశారు. ఎస్.ఐ.ఆర్ పై అవగాహన ఎన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ కార్యక్రమం డివిజన్ వ్యాప్తంగా జరుగుతుందని, డివిజన్ ప్రజలు ఎలాంటి అపోహలు ఆందోళనకు గురికావద్దని తెలిపారు. డివిజన్ ప్రజలకు ఓటుకు సంబంధించిన విషయంలో సమస్యలు తలెత్తుతే తనను సంప్రదించవచ్చన్నారు. 170 పోలింగ్ బూత్ లో బూత్ లెవల్ అధికారులు (బిఎల్ ఓ) అనిత, బి ఎల్ ఓ2 వెంకటస్వామి, రాజేందర్ రావు లతో కలిసి కార్పొరేటర్ ప్రవీణ్ రావు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ చేశారు. ఈ ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## ప్రశంసా పత్రం అందుకున్న రేపాక గ్రామ వాసి బిళ్ళ సతీష్



**జనసైన్యం సిటి**
చిన్న వయసులో నే కవితల పట్ల రచన సాహిత్యం లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలములోని రేపాక గ్రామనికి చెందిన బిళ్ళ సతీష్ రాసిన పలు కవితలకు సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సిద్ధిరెడ్డి ఈ రోజు శనివారం నాడు హైద్రాబాద్ లోని రవీంద్ర భారతి లో బిళ్ళ సతీష్ కు ప్రశంసా పత్రం అందజేయడం జరిగింది..ఈ సందర్భంగా బిళ్ళ సతీష్ ను ఇంత చిన్న వయసులో నే రేపాక గ్రామ చరిత్ర తో పాటు పలు రచనలు సాహిత్యలు అందరిని ఆకట్టుకున్నాయని అన్నారు ఈకార్యక్రమంలో కవులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రక్షాళనలో బీజేపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి



**జనసైన్యం సిటి**
ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటూ అత్యంత విలువైనదని, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ( -స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియలో బిజెపి శ్రేణులు అప్రమత్తంగా ఉండి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంటోనీ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రోజున కరీంనగర్ జిల్లా లోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా , రాష్ట్ర పరిశీలకునిగా ఆంటోనీ రెడ్డి హాజరై సర్ నిర్వహణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, ఓటరు నమోదు, చిరునామా మార్పులు తప్పుల సవరణ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని, ప్రజాస్వామ్య బలోపేతంలో యువత భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమన్నారు. బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ) ఇంటింటికి వచ్చి చేసే వెరిఫికేషన్ ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు నిరంతరం నిఘా ఉంచాలని, అర్హులైన వారెవరూ జాబితా నుండి తొలగించబడకుండా చూడాలని కోరారు. ఓటరు జాబితాలో లోపాలు లేకుండా చూడటం పార్టీ గెలుపులో మొదటి మెట్టు అని, బూత్ స్థాయి కమిటీలు ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూనే, ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ఒక బాధ్యతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆంటోనీ రెడ్డి సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడటం ద్వారానే ప్రజాస్వామ్యయుతమైన ఎన్నికలకు పునాది వేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు, జిల్లా కార్యదర్శి నరసింహ రాజు ,మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుర్రాల నిర్మల రెడ్డి, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, హుజురాబాద్ నియోజకవర్గ మండల అధ్యక్షులు తూర్పాటి రాజు, కొండల్ రెడ్డి కొలగాని రాజు బైరెడ్డి రమణారెడ్డి రమేష్ బత్తిని నరేష్ ర్యాకం శ్రీనివాస్ వొద్నాల విజయ్ లతోపాటు మానకొండూరు , చొప్పదండి , కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు తీయడమే ప్రజాసంక్షేమమా?



వడ్డేపల్లి మల్లేశం

పేదరికం, నిరుద్యోగము, ఆకలి చావులు, ఆత్మహత్యలు, అసమానతలు, అంతరాలు, దోపిడీ పీడన వంటి అనేక మౌలిక సామాజిక రుగ్మతలు ఈ దేశంలో తాండవించడం వలన ప్రజల జీవన ప్రమాణాలు అగాదానికి పడిపోతూ విలువైన మానవ వనరులను ఈ దేశం కోల్పోతున్నది. ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడంతోపాటు పనికి తగిన వేతనశీ లేదు. చాలీచాలని వేతనాలతో తమ పిల్ల జల్లలను చదివించుకోలేక వీధిపాలవుతో కుటుంబాలు పట్టణాల్లో కూడా ఆత్మహత్యల పాలవుతున్నాయి. అయితే గ్రామాల్లో మాత్రం ఏమైనా సంతోషంగా ఉందా వాతావరణం లేదు. పని లేక కనీస గృహ వసతి మానవాభివృద్ధి సాధ్యం కానీ ఈ దేశంలో పేరుకు మాత్రమే ప్రజాస్వామ్యం అని గర్వంగా చెబుతూ ప్రపంచంలోనే అత్యంత పెద్ద రాజ్యాంగం కలిగిన దేశంగా పేరు ఉంటే ప్రయోజనం ఏమున్నది? కడుపునిండా నాలుగు మెతుకులు నొచని లక్షలాది కుటుంబాలకు ఈ దేశంలో కొదవలేదు. అదే సందర్భంలో పిల్లలను చదివిపించుకోలేక గూడు గుడ్డకు నోచని దౌర్భాగ్య కుటుంబాల చూస్తూ కూడా మౌనంగా ఉంటున్నారంటే ప్రభుత్వం ఏనాడో తన సామాజిక బాధ్యతను విస్మరించింది అని అర్థం. దాని పరిణామమే వేలాది, లక్షలాదిగా ఆత్మహత్యల పాలవుతున్న వరుస క్రమంలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామంలో రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబంలో శ్రీరాముల వీరాచారి కర్ర పని చేస్తూ తాను పొట్ట పోసుకుంటున్నాడు ఇద్దరు ఆడపిల్లలతో పాటు భార్యను పోషించుకోలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో అవమానానికి గురై, జీవన పోరాటంలో గెలువలేనని, ఓటమిని అంగీకరించిన దానికి పర్యవసానంగానే ఆత్మహత్య చేసుకున్నాడు ఇది అత్యంత బాధాకరం. సమస్యలుంటే పరిష్కరించుకోవడానికి పాలకులు ఎప్పటికీ కృషి చేయాలి కానీ ఆ రకమైనటువంటి కృషి లేదు తమ గమ్యాన్ని గమనాన్ని చూసుకోవడం, అధికార దర్పాన్ని కాపాడుకోవడం, అక్రమాస్తుల కూడబెట్టుకోవడానికి సరిపోతున్నది తప్ప ఇలాంటి పేద కుటుంబాలను కాపాడి పేదరికం ఈ దేశం నుండి తరిమి కొట్టడానికి ప్రయత్నం చేసిన దాఖలా లేదు. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు శ్రీమతి సోనియాగాంధీ ఇప్పటికీ ఈ దేశంలో 20 శాతానికి పైగా పేదరికం తాండవిస్తున్నదని నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్యసే కూడా కనీస మానవాభివృద్ధి కరువై కనీస అవసరాలకు నోచుకోని వాళ్ళు కోట్లలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని పాలకులు ఏనాడైనా చెవిన పెట్టినారా? ఆ నిర్లక్ష్యం పాపమే ఈనాడు శ్రీరాముల వీరాచారి ఆత్మహత్య. ఇలాంటి సంఘటనలు రోజు లక్షల సంఖ్యలో ఈ దేశంలో జరుగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము నుండి ఏదో సాధించాలని ఎంతో ఉద్ధరించాలని తపనపడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే నేడు మనం సాధించుకున్న తెలంగాణ మనం కోరుకున్న తెలంగాణ కానేకాదు. అయితే ఈ ఆత్మహత్యలు ఎందుకు ఉంటాయి? ఈ పేదరికం ఎందుకు ఉంటుంది? ఈ దోపిడీ ఎందుకుంటుంది? ఈ వలస ఆధిపత్యం ఉండకూడదు కదా! అని సామాన్యులు ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేక తమ అధికారాన్ని చూస్తూ మురిసిపోతున్నటువంటి రాజకీయ నాయకులు ఇదే గొప్ప వరమని ఇదే మనం ఆశించిన తెలంగాణ అని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు.

ఇద్దరూ ఆడపిల్లలు చదువుకుంటున్న తరుణంలో వాళ్లను పోషించడం చదివించడం కుటుంబాన్ని నెట్టుకు వెళ్లడం ఇప్పుడు వీరాచారి మరణం తర్వాత ఆ కుటుంబాలకు చెప్పరాని భారంగా పరిణమించింది. పని చేసిన నాడు కడుపుకే సరిపోలేదు, బట్టలకు ఆగమాగమే, ఇక అర్ధ అవకాశాలతో వెలుతురు చీకటితో నిండిన పేద ఇంటిలోనే జీవితం. ప్రశ్నిస్తే ప్రతిఘటిస్తే మౌనంగా ఉండడం తప్ప. ఇంకా ధిక్కరిస్తే శిక్షిస్తారు ప్రాణం తీస్తారు అంతే కదా! అదేనా సంక్షేమ రాజ్యం యొక్క నమూనా బాధ్యత కర్తవ్యం?. గ్రామ గ్రామాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు అధికారులు సామాజికవేత్తలతో కూడుకున్న బృందం అనునిత్యం పర్యటించాలి. కుటుంబం యొక్క బాగోగులు ఆర్థిక నేపథ్యం భూమి జాగా ఇల్లు ఇరవాటం అన్నింటిని నమోదు చేయాలి. లోటు ఎక్కడుంది మిగులు ఎక్కడుంది ఏ అంశాల్లో ప్రయత్నం చేయాల్సిన బాధ్యత ఉంది ఏ లోటుని ఎలా కవర్ చేయాలి అనే సోయి పాలకులకు ఉండాల్సిన అవసరం ఉంది. ఎప్పటికప్పుడు సర్వే గనక చేసినట్లయితే ఎ క్కడ లోటుంది, ఎవరికి పనిలేదు, ఎవరికి ఉపాధి లేదు, ఎవరి కుటుంబం వీధిపాలవుతున్నది, ఎవరి పిల్లలు బడికి పోలేకపోతున్నారు, ఎవరి కుటుంబం అప్పుల్లో మునిగి ఆత్మహత్యలకు చేరువైందో తెలిసే అవకాశం కొంతవరకైనా ఉంటుంది కదా! ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం ప్రజల గురించి క్షేత్రస్థాయిలో పర్యటించాలి జన గణన కోసం కేవలం గణాంకాలు సేకరించారే తప్ప వాళ్ల యొక్క ఆర్థిక సామాజిక రాజకీయ పరిస్థితులను తెలుసుకున్న దాఖలా లేదుఅదే ఇవాళ ముఖ్యం. అందుకోసమే ఇవ్వాలా కొత్త పయనం కావాల్సిన అవసరం ఉంది అనేకమంది మాజీ రాజకీయ నాయకులు, రైతులు, కూలీలు, ప్రజా ప్రతినిధులు,

మహిళా నాయకురాల్లు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ""ఒకనాడు తెల్లగా బతికి నేడు పిడికెడు మెతుకులకు కరువై అవమాన భారంతో కూరుకుపోయి ఇతరులతో చెప్పుకోలేక ఎవరిని అడగలేక ఏం చేయాలో తోచక బలవంతపు మరణాలతో తనువు చాలిస్తున్న ఈ పేద వర్గాల యొక్క ఊపిరి ఇలాగే గాలిలో కలిసి పోవాల్సిందేనా? ఏమైనా మార్గాలు ఉన్నాయా? ప్రభుత్వం ఆలోచించకపోతే ఎందుకీ రాజ్యాంగం? ఎందుకు ఈ ప్రజాస్వామ్య పాలన?"".

విధిలేక అవమాన భారంతో పూట గడవని పరిస్థితిలో ప్రత్యేక కారణాలు ఉంటే తప్ప ఆత్మహత్యలకు ఎవరు పూను కోరు. అలాంటి పరిస్థితుల్లో వీళ్ళ క ఆర్థిక పరిస్థితిని పరిశీలించి శాశ్వత ఉపాధి మార్గాలతో పాటు కూడు గూడు ఏర్పాటు చేయడం ప్రభుత్వాలు యొక్క కర్తవ్యం. అవసరం అవకాశమున్నచోట నిధులు భూమిని సేకరించి కనీసంగానైనా కొంత భూమిని పంపిణీ చేయడం ద్వారా వాళ్లలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది. వృత్తి పనులు ఇవాళ బజారున పడినవి. గిరాకి లేని పరిస్థితి లోపల ఎవరిని అడగాలో తెలియని ఇబ్బందుల్లో ఆత్మహత్యలే శరణ్యం అనుకుంటున్నారా? అటువంటి అన్నలారా! తమ్ములారా! అక్కలారా! చెల్లెలారా! మీరు కూడా ఒక్కసారి ఆలోచించండి. మన దౌర్భాగ్య పరిస్థితులకు చావు పరిష్కారం కాదు పోరాటం, ప్రతిఘటన, ప్రశ్న ముఖ్యం. ఆ వైపుగా పాలకులను కదిలిద్దాం మన ప్రశ్నలతో ఇంకెంతోమంది నిద్ర మత్తు నుండి మేల్కొనేలా ప్రయత్నం చేద్దాం. ఈ దేశంలో ఉన్నటువంటి సకల సంపదలో మన వాటా మనకు దక్కేలా పోరాటం చేద్దాం. ఒక్క శాతం సంపన్న వర్గాల చేతిలో 40 శాతం సంపద మూ లుగుతున్నదంటేనే ఈ దేశంలో సమానత్వం లేదు. అసమానతలు, అసమరాజ్యం నడుస్తున్నది అని అర్థం. ఈ దుర్మార్గ పరిపాలనకు చరమగీతం పాడాలంటే అంబేద్కర్ ఆశించినటువంటి ప్రజారాజ్యాన్ని అమల్లో చూడాలి. పాలకులు ప్రజల అవసరాలను గుర్తించినప్పుడు తమ హక్కులు నష్టపోయినమని బాధపడినప్పుడు మనుగడ



కోసం పోరాటం చేసి తమకు అనుకూలమైనటువంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటారని అది చరిత్ర గమనంలో తప్పదని హెచ్చరించినటువంటి అంబేద్కర్ మాటల సాక్షిగా మనమంతా పునరాంకితమవుదాం. ముది మాణిక్యం గ్రామంలో కుటుంబానికి గ్రామానికి మానవ వ్యవస్థకు దూరమైనటువంటి శ్రీరాముల వీరాచారిని స్మరించుకుంటూ త్యాగాన్ని నెమరు వేస్తూ ఆ కుటుంబానికి అలాంటి వేలాది కుటుంబాలకు అండగా ఉండడానికి మన వంతుగా ప్రయత్నం చేద్దాం! ప్రభుత్వం ఆ పేద కుటుంబానికి 10 లక్షల రూపాయల తక్షణ ఆర్థిక సహాయాన్ని కల్పించడం ద్వారా మౌలిక వసతులను సమకూర్చడంతో పాటు ఇద్దరూ అమ్మాయిలకు చదివినంత కాలం తోడునీడగా ప్రభుత్వం సహకారం అందించాలని, తల్లికి నైపుణ్యం లేని పనిలో ఎక్కడైనా ఏదైనా సందర్భంలో అవకాశం కల్పించడం ద్వారా ఉపాధి కల్పించాలని, దుఃఖ భారంతో నిండిన ఆ కుటుంబాన్ని ఆదుకోవడం ఇవాళ రాజకీయ ప్రజా పాలకుల యొక్క కనీస ధర్మం అని మన పోరాటాలు నిరసనలు ర్యాలీలు పత్రిక ప్రకటనల ద్వారా వ్యవస్థకు తెలియజేద్దాం! ప్రభుత్వాల కళ్ళు తెరిపించాల్సిందే ఎందుకంటే ఇది కేవలం వీరాచారి ఒక్క మరణంతోనే ముగిసిపోతుందని అనుకోలేము. ఇంతకుముందు లక్షల మంది బలి అయినట్లే ఇప్పుడు కూడా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే మరింతో మంది మృత్యువాత పడతారు. వీరాచారి మరణం పాలకులకు కనువిప్పు కావాలి ఆయన మరణం ద్వారానైనా మనిషి యొక్క కనీస అవసరాలను అమర్త్యసేన్ సూచించినటువంటి మానవాభివృద్ధిని ప్రభుత్వాలు తమ దినచర్యగా కర్తవ్యం లో భాగంగా గుర్తించాలని, మనిషి మనుగడను గుర్తించనటువంటి ప్రాధాన్యత ఇవ్వని పాలకులు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టిన నిష్ప్రయోజనం అని ఇప్పటికైనా కళ్ళు తెరుస్తారని మనసారా కోరుకుందాం. ఆ మట్టి బిడ్డ శ్రీరాముల వీరాచారికి మనసారా నివాళి.

## ఇష్టారాజ్యంగా, ఫీజులు వసూలు చేస్తున్న, ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేయాలి



**జనసైన్యం సిటి**

**ఇష్టారాజ్యంగా, ఫీజులు వసూలు చేస్తున్న, ప్రైవేట్ స్కూళ్లను వెంటనే తనిఖీ చేసి, చర్యలు తీసుకోవాలని, అలాగే డీఈఓ ఆఫీస్ కు, ఆఫీస్ పేరు అడ్రస్ బోర్డు పెట్టాలని, బోర్డు లేకపోవడం, డీఈవో నిర్లక్ష్య పనికి ఇది నిదర్శనమని, డిఇవో సూపరింటెండెంట్ గారికి వినతిపత్రం సమర్పించిన మాతంగి రమేష్ మీఖీ రాష్ట్ర అధ్యక్షులు.జిల్లా వ్యాప్తంగా, ప్రైవేట్ స్కూల్లో, అధిక ఫీజులు వసూలు చేస్తూ, స్కూల్ యూనిఫామ్, బుక్స్, షూస్, టై, బెల్ట్, అలాగే అడ్మిషన్ ఫీజుల రూపంలో, 10, మరియు 15 వేల రూపాయలు, అక్రమంగా వసూలు చేస్తున్నారని, వెంటనే ప్రైవేట్ స్కూళ్ల ను డిఇఓ , తనిఖీ చేసి, చర్యలు తీసుకోవాలని, డిఇవో ఆఫీస్ లో, సూపరిండెంట్ సెక్షన్ దీ గారికి , మాతంగి రమేష్ M S F రాష్ట్ర అధ్యక్షుడు వినతిపత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా, మాతంగి రమేష్ MSF రాష్ట్ర అధ్యక్షులుగారు మాట్లాడుతూ, జూన్ 12 విద్యా సంవత్సరం మొదలు కాకముందే అధిక ఫీజులు వసూలు చేస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల, రక్తం తాగుతున్నారని, ఒకటీ, రెండవ తరగతి స్కూలు పిల్లలకు, కేవలం బుక్స్ కే, రెండు మూడు వేలు వసూలు చేస్తున్నారని, అడ్మిషన్ ఫీజు విద్యాహక్కు చట్టం ప్రకారంగా తీసుకోవద్దు, కానీ, నాలుగు ఐదు వేలు నుండి మొదలుకుంటే, 15000 నుండి 20,000 తీసుకుంటున్నారని, విద్యాశాఖ అధికారులు, కరీంనగర్ జిల్లాలో, వేలాదిగా ప్రవేట్ స్కూల్స్ ఉంటే, కనీసం ఒకటి రెండు స్కూళ్లపై, కూడా తనిఖీ చేయకపోవడం, వారు ప్రవేట్ స్కూల్ కు కొమ్ముకాస్తున్నారు అని అర్థమయిపోతుందని, అలాగే డీఈఓ ఆఫీస్ కు పేరు బోర్డు కూడా లేకపోవడం, జిల్లా విద్యను మరియు, విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన జిల్లా కార్యాలయానికి, పేరు లేకపోతే, డీఈవో , జిల్లా విద్యార్థులకు ఏం న్యాయం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు, బోర్డు కొత్తది పెట్టించాలనీ డిమాండ్ చేశారు.., ఇప్పటివరకు పలు విద్యార్థి సంఘాలు, మరియు మీఖీ విద్యార్థి సంఘం తరపున కూడా, కొన్ని స్కూల్స్ పై కంప్లైంట్ చేస్తే, ఎంఈఓ డిఇఓ , కనీసం ఆ స్కూళ్లను పర్యవేక్షించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, వెంటనే విద్యాశాఖ అధికారులు, మామూళ్ల మత్తు నుండి తేలుకొని, ప్రైవేట్ స్కూళ్ల తనిఖీ చేపట్టకపోతే, డిఇవో ఆఫీస్ ముట్టడిస్తామని డిమాండ్ చేశారు, మీఖీ పక్షాన డిమాండ్ చేశారు,**

# దివ్యాంగులకు త్వరలో ఇంటర్ తరగతులు ప్రారంభం



జనసైన్యం సిటి

"వైకల్యం విజయానికి అడ్డంకి కాదు... ఆత్మవిశ్వాసం లేకపోవడమే అసలైన అడ్డంకి. శరీరానికి పరిమితులు ఉండొచ్చు... కానీ సంకల్పానికి ఎలాంటి పరిమితులు ఉండవు" అని దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ప్రపంచానికి పట్టుదల, ఆత్మవిశ్వాసం, అచంచల సంకల్పానికి ప్రతీకగా నిలిచిన హెలెన్ కెల్లర్ 146వ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకుల కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... హెలెన్ కెల్లర్ జీవితం ప్రపంచానికి శాశ్వత స్ఫూర్తి అని పేర్కొన్నారు. కేవలం 19 నెలల వయసులో చూపు, వినికిడి రెండింటినీ కోల్పోయినా ఆమె తన సంకల్పబలంతో ప్రపంచ చరిత్రలో చెరగని ముద్ర వేసిందన్నారు. తన గురువు ఆన్ సలివన్ మార్గదర్శకత్వంలో స్పర్శ ద్వారా విద్యను అభ్యసించి, దృష్టి-శ్రవణ వైకల్యం ఉన్న తొలి డిగ్రీధారిణిగా చరిత్ర సృష్టించడమే కాకుండా రచయిత్రిగా, వక్తగా, సామాజిక సేవకురాలిగా కోట్లాది మంది దివ్యాంగులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు.

"ఆమె చీకటిలో జీవించింది... కానీ ప్రపంచానికి వెలుగు చూపించింది. హెలెన్ కెల్లర్ ఒక వ్యక్తి కాదు... పట్టుదల అనే పదానికి ప్రత్యక్ష రూపం" అని మంత్రి పేర్కొన్నారు.

సంక్షేమం నుంచి సాధికారత వైపు తెలంగాణ ప్రయాణం

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం దివ్యాంగులను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సమాజ నిర్మాణంలో భాగస్వాములుగా తీర్చిదిద్దే దిశగా కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తెలిపారు.దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకాన్ని రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచడం, స్కూటీలు, ఎలక్ట్రిక్ మొబిలిటీ వాహనాలు, సహాయక పరికరాల పంపిణీ, ఆన్‌లైన్ దరఖాస్తుల ద్వారా రెండున్నరేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో సుమారు 2,000 మంది లబ్ధిదారులకు పారదర్శకంగా సహాయం అందించామని వెల్లడించారు.దివ్యాంగ ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతంలో బదిలీలు పొందేందుకు జీవో నెం.34 ద్వారా అవకాశం కల్పించడం ఈ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయమని పేర్కొన్నారు.దివ్యాంగ విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రాధాన్యమిస్తూ కరీంనగర్, మహబూబ్‌నగర్, మిర్యాలగూడలో ప్రస్తుతం పదో తరగతి వరకు ఉన్న ప్రత్యేక పాఠశాలలను త్వరలో ఇంటర్మీడియట్ వరకు విస్తరించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించి అడ్వైజరీ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

ప్రత్యేక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వేతనాల్లో ఆలస్యం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు.దివ్యాంగుల పెన్షన్‌ను ప్రస్తుతం ఉన్న రూ.4,000 నుంచి రూ.6,000కు పెంచే దిశగా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని, త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దివ్యాంగులకు వారి కోటా ప్రకారం ప్రాధాన్యతనిస్తూ ఇళ్ల కేటాయింపులు జరుగుతున్నాయని, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాల్లోనూ వారికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు.

"మీ సమస్యలు నా కుటుంబ సమస్యలే"

దివ్యాంగుల కష్టాలు తనకు బాగా తెలుసని, తాను కూడా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు."మీకు మంత్రిగా కాదు... మీ కుటుంబ సభ్యుడిగా అండగా ఉంటాను. మీ సమస్యల పరిష్కారం నా బాధ్యత" అని హామీ ఇచ్చారు.గత పాలకులు దాదాపు పదేళ్లపాటు దివ్యాంగుల సమస్యలను పట్టించుకోలేదని, ప్రజా ప్రభుత్వం మాత్రం వారి ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు.త్వరలో జావేద్ అబిద్ విగ్రహం ఏర్పాటు చేస్తానని మంత్రి అడ్లూరి హామీ ఇచ్చారు.వికలాంగుల హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసి వారి సంక్షేమం కోసం పాటుపడిన జావేద్ విగ్రహాన్ని ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తానన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న ప్రతిభావంతులైన పలువురు దివ్యాంగ విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ఇతర సహాయక పరికరాలు అందజేశారు.

విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం

విద్యార్థులను ఉద్దేశించి మంత్రి అడ్లూరి మాట్లాడుతూ...

"మీరు జాలి కోరే వారు కాదు... అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించే ప్రతిభావంతులు.""మీ వైకల్యం మీ గుర్తింపు కాదు... మీ విజయం మీ అసలైన గుర్తింపు."

"మీ లోపాన్ని ప్రపంచం గుర్తుంచుకోదు... మీరు సాధించిన విజయాన్ని మాత్రమే చరిత్ర గుర్తుంచుకుంటుంది."అని మంత్రి అడ్లూరి ఉద్బోధించారు.

దేశంలో దృష్టిలోపాన్ని అధిగమించి సివిల్ సర్వీసుల్లో అత్యున్నత విజయాలు సాధించిన పలువురు యువతను ఉదాహరణగా పేర్కొంటూ, కుటుంబం, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యమైనా సాధ్యమేనని చెప్పారు.

"ఈ రోజు బెంచ్‌పై కూర్చున్న విద్యార్థే... రేపు జిల్లా కలెక్టర్ కావచ్చు. ఐఏఎస్, ఐపీఎస్, శాస్త్రవేత్తలు, వైద్యులు, న్యాయమూర్తులు, పారిశ్రామికవేత్తలు మీలో నుంచే రావాలి. మీ పేరు ముందు 'దివ్యాంగుడు' కాదు... 'విజేత' అని సమాజం పిలిచే రోజు రావాలి" అని మంత్రి ఆకాంక్షించారు.

"అవరోధాలను అవకాశాలుగా మార్చుకుందాం... పరిమితులను విజయాలుగా మలుచుకుందాం... ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుదాం... తెలంగాణ అభివృద్ధి గాథలో మన విజయాలను స్వర్ణాక్షరాలతో లిఖిద్దాం" అని మంత్రి అడ్లూరి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా దివ్యంగా విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, దివ్యాంగుల శాఖ సంచాలకురాలు శైలజ, కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ప్రభంజన్, వివిధ దివ్యాంగ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో ఎగిరేది కాషాయ జెండానే.

**జనసైన్యం సిటి**

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులుగా శ్రీ నితిన్ నబిన్ గారు ఎన్నికయిన తర్వాత మొట్టమొదటిసారిగా తెలంగాణ గడ్డ మీద రేపు రెండున్నర గంటలకు అడుగు పెట్టబోతున్నారు.

బెంగాల్ ఎన్నికల తర్వాత అనుకున్నట్టుగానే ఢిల్లీ హై కమాండ్ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారే స్వయంగా రేపటి మా డెస్టినేషన్, మా టార్గెట్ తెలంగాణ రాష్ట్రం అని చెప్పారు.

ఈ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ సర్కార్ ఏర్పాటు చేయాలని సంకల్పంలో భాగంగానే గత 10వ తారీకు నాడు లక్షలాది మంది సమక్షంలో పరేడ్ గ్రౌండ్స్ లో మోదీ గారి సభ ఏర్పాటు చేసి ఒక సంకేతం ఇవ్వడం జరిగింది. దాంట్లో భాగంగానే ఆరు నూరైనా ఇక్కడ ఉన్న కరప్ట్ సర్కార్, ప్రజా వ్యతిరేక సర్కార్, ప్రజలని వంచించే సర్కార్, ప్రజల కళ్ళల్లో మట్టికొట్టే సర్కార్, ప్రజల ఇళ్లను కూలగొట్టే సర్కార్, పేదల భూములు గుంచుకునే సర్కార్ గద్దె దిగాలని చెప్పి ఏ ప్రజలైతే కోరుకుంటున్నారో ఆ ప్రజలకు భరోసా ఇవ్వడం.. ఆ ప్రజలకి విశ్వాసం కలిపించే ఉద్దేశంతోటే నితిన్ నబిన్ గారు మూడు రోజుల పాటు ఇక్కడ పర్యటించబోతున్నారు.

రేపు మధ్యాహ్నం 2:30 గంటలకు శంషాబాద్ ఎయిర్పోర్ట్ లో అడుగు పెట్టిన తర్వాత.. జిహెచ్ఎంసి పరిధిలో ఉన్నటువంటి పోలింగ్ బూత్ ల వారిగా ఎస్.ఐ.ఆర్ కోసం మేము నియమించుకున్న బి.ఎల్.ఏ.లను ఉద్దేశించి వారు ప్రసంగించబోతున్నారు. నాంపల్లి పార్టీ ఆఫీస్ పక్కన ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో దాదాపు 12 వేల మంది బి.ఎల్.ఏ.లతో మీటింగ్ జరగనుంది. వారికి దిశానిర్దేశం చేయనున్నారు. ఏదో కొద్దిమంది ఓట్లే తొలగిస్తారు.. ప్రతిపక్షాల ఓట్లు తొలగిస్తారు.. అనేటువంటి నీచపు ఆరోపణలను మేము తీవ్రంగా ఖండిస్తూనే ఉన్నాం.ఇక్కడ ఉన్న కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాళ్ళతో జతకట్టినటువంటి పార్టీ ఎం.ఐ.ఎం ఇద్దరు కలిసి దొంగే దొంగ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దొంగ ఓటు తెలవకుండా చూసుకోవాలి, దొంగ ఓట్లను పదిల పరుచుకోవాలనటువంటి కుట్ర వాళ్ళు చేస్తున్నారు.

బూత్ లెవెల్ ఆఫీసర్స్ కాంగ్రెస్ ప్రభుత్వం పరిధిలో ఉంటారు. గవర్నమెంట్ యంత్రాంగం అంతా కూడా వాళ్ళ చేతిలో ఉంటారు అనే విషయం మర్చిపోయి.. భారతీయ జనతా పార్టీ మీద.. కేంద్ర ఎన్నికల సంఘం మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. వీరి పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజల్ని అలెర్ట్ చేయాల్సినటువంటి బాధ్యత మా మీద ఉంది కాబట్టి రేపు దిశా నిర్దేశం చేయబోతున్నారు.యావత్ తెలంగాణ ప్రజానికానికి నేను వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్న.. గతంలో మనం అనేకసార్లు చూసాము.. పోలింగ్ బూత్ కు పోగానే మా ఓటు లేదు.. నీ బూత్ ఇక్కడ కాదు.. అని చెప్పే వారు.రాజ్యాంగం ప్రతి మనిషికి ఏ ఓటు హక్కు అయితే కల్పించిందో ఆ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఓటర్ పైన ఉంటది.దాన్ని కల్పించే బాధ్యత అంత ఎన్నికల కమిషన్ మీద ప్రభుత్వాల మీద ఉంటది. కాబట్టి చాలా సంవత్సరాల తర్వాత ఒక సాహసోపేతమైన ఒక న్యాయబద్ధ ఓటర్కు ఓటు కల్పించేటువంటి ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి.రెండవది అతి ముఖ్యమైనది ఇవాళ హైదరాబాద్ నగరంలో గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు ఎక్కువ ఓట్లు ఉన్న చోట్ల పోలింగ్ కేంద్రాలను పెంచి.. మీ అపార్ట్మెంట్ లో ఉన్నటువంటి మీ కమిటీ హాల్లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.గతంలో ఉన్న ప్రభుత్వం కుటుంబ పాలనతో దోపిడి చేసి మూటగట్టుకుంది. 70 ఏళ్లుగా పేదలు దున్నుకుంటున్న భూములను ఈ ప్రభుత్వం విఆర్ఏలు లేరు కాబట్టి.. కంప్యూటర్లలో టకటక మార్చి.. చీఫ్ సెక్రెటరీ, సిసిఎల్ఏ, కలెక్టర్ కి ఆదేశాలు ఇచ్చి హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్నటువంటి విలువైన భూముల్ని రికార్డులలో తారుమారు చేసుకొని అసైన్మెంట్ భూములన్నీ కూడా రెగ్యులైజ్ చేసుకున్న తీరు ఇవాళ ఆశ్చర్యం కలిగిస్తా ఉంది.ఏ ప్రభుత్వం కూడా ఈ సాహసం చేయలేదు.అసైన్మెంట్ భూములని పట్టా భూములుగా మార్చే ప్రక్రియ ఏ ప్రభుత్వం చేయలేదు. ఉన్న హామీలు అమలు చేయట్లేదు. ఫీ రియంబర్స్మెంట్ లేదు. రైతు బంధు లేదు. రైతు బీమా సక్కగా లేదు. ఇంక తులం బంగారం కావచ్చు.. ఇవాళ కౌలు రైతులకు రైతు బంధు కావచ్చు.. 500 రూపాయల వడ్లకు బోనస్ కావచ్చు.. కొత్త హామీలు దేవుడు ఎరుగు కానీ పాత వాటిని అమలు చేసే పరిస్థితి లేదు.చివరికి ఉద్యోగులు దాచుకున్నటువంటి డబ్బులు కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితి ఉన్నది.ప్రజలందరూ కూడా తప్పు చేశాం అనుకుంటున్నారు.ఈ రాష్ట్రంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. ఎంత తీవ్రమైన ఆవేదన, దుఃఖం ఉందో గ్రౌండ్లో తిరుగుతున్న మాకు అర్థమవుతుంది. కాబట్టి ఈ దోపిడి, భూకబ్జాకోరు ప్రభుత్వాన్ని గద్దదించాలని ప్రజలు భావిస్తున్నారు. ఆ ప్రజలకి నాయకత్వం వహించే బాధ్యత, ఆ ప్రజా సమస్యలు తీసుకొని ఉద్యమాలు చేసే బాధ్యత.. భారతీయ జనతా పార్టీ



ఈటల రాజేందర్, ఎంపీ, మల్కాజిగిరి.

కార్యకర్తలకు నాయకులుగా మా మీద ఉంది.నితిన్ నబిన్ గారితో ఘట్కేసర్ మండలంలో.. ఔషాపూర్ గ్రామంలో.. రాక్ గార్డెన్ లో మా రాష్ట్ర స్థాయి నాయకుల మీటింగ్ ఏర్పాటు చేయబోతున్నాం.రాష్ట్ర కమిటీతో పాటుగా వివిధ క్షేత్రాలకు, మోర్చాలకు సంబంధించినటువంటి నాయకులతో పాటుగా.. దాదాపు పదివేల మంది నాయకుల సమావేశం 30వ తారీకు ఉదయం 10 గంటలకు ఉంటుంది.ప్రభుత్వ వైఫల్యాల మీద.. మనం చేయాల్సినటువంటి పనుల మీద నబిన్ గారు దిశానిర్దేశం చేస్తారు.29 ఉదయం 10 గంటలకు విజ్ఞాన భారతి ఇంజనీరింగ్ కాలేజీలో.. యువ సమ్మేళనం సమావేశం కూడా పాల్గొంటారు. అదే రోజు వరంగల్ లో పార్టీ నాయకుల కార్యకర్తల సమావేశం కూడా జరగబోతుంది.భారతీయ జనతా పార్టీ నాయకులుగా కార్యకర్తలుగా గ్రౌండ్లో ఏం జరుగుతుందో సంపూర్ణంగా అర్థం చేసుకున్న వాళ్ళుగా మాకు దుఃఖం వస్తుంది. అందుకే ప్రజలకు నాయకత్వం వహించడానికి సుమాయుక్తమైనటువంటి ఈ సందర్భంలో ప్రజలు బిఆర్ఎస్ ని చూసినం, కాంగ్రెస్ ని చూసినం చూడవాల్సింది భారతీయ జనతా పార్టీ సర్కార్ ను మాత్రమేనని అంటున్నారు.అప్పుల ఊబిలో కూరుకుపోయిన.. ఈ రాష్ట్రం పాత శోభను కోల్పోయిన ఈ రాష్ట్రం అన్నమో రామచంద్ర అంటూ బిక్కు బిక్కుమంటూ ఎదురుచూస్తున్న ప్రజానికానికి భారతీయ జనతా పార్టీ శ్రీరామ రక్షగా ఉంటుందని చెప్పి ప్రజలు భావిస్తు ఉన్నారు కాబట్టి మేము సిద్ధంగా ఉన్నామనే సంకేతం దేశ అధ్యక్షుడు ఇవ్వబోతున్నారు.బిఆర్ఎస్, కాంగ్రెస్ కు ఓటు వేసేది లేదని ప్రజల్లో స్పష్టంగా ఉంది. ఈ దఫా తప్పకుండా భారతీయ జనతా పార్టీకే ఓట్లు వేసుకోవాలి.. ఈ దోపిడిని అంతమొందించాలి, పేదల సంక్షేమ రాజ్యాన్ని తీసుకొచ్చుకోవాలి, డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి..ఈ రాష్ట్రం అప్పుల ఊబి నుంచి బయట పడాలని చెప్పే భావన ఉంది. కాబట్టి ప్రజల ఆలోచనని సంపూర్ణం చేసే బాధ్యత మా మీద ఉంది.కాబట్టి వాళ్ళకు నాయకత్వం వహిస్తాము.రాబోయే కాలంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఈ రాష్ట్రంలో ఏర్పడే సర్కార్ భారత భారతీయ జనతా పార్టీ సర్కార్.